వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
VOICE OF PRAJALU
TGTEL/25/A2649
తెలుగు దినపత్రిక
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
సోమవారం, మార్చి 30, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల సమయం



తిరుమల శ్రీవారి దర్శనానికి నిన్న భక్తులు పోటెత్తారు. వారాంతం కావడంతో కొండపై భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం (మార్చి 28) ఒక్కరోజే 82,040 మంది భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.18 కోట్లుగా నమోదైంది. అలాగే, 31,606 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 26 కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 8 గంటల సమయం పడుతుందని అంచనా.





# రేవంత్ పాలనలో 19 స్కామ్‌లు..

## సిట్టింగ్ జడ్జితో విచారణ చేయండి: బీఆర్ఎస్

**అవినీతి కేంద్రంగా రాష్ట్రం మారిందని విమర్శలు**

**హైకోర్టు సిట్టింగ్ జడ్జితో లేదా హౌస్ కమిటీతో దర్యాప్తు డిమాండ్**

**సీఎంకు లేఖ పంపాలని స్పీకర్‌కు కేటీఆర్ విజ్ఞప్తి**

**మంత్రి కుటుంబానికి చెందిన మైనింగ్ అంశం మధ్యే లేఖ సమర్పణ**

**రూ.వేల కోట్ల ప్రజా ధనం మళ్లింపుపై ఆందోళన**

హైదరాబాద్, మార్చి 30: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండేళ్ల మూడు నెలల పాలనలో మొత్తం 19 ప్రధాన కుంభకోణాలు చోటుచేసుకున్నాయని బీఆర్ఎస్ శాసనసభా పక్షం ఆరోపించింది. ఈ కుంభకోణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో లేదా సభాసంఘం ద్వారా సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన లేఖను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పీకర్‌కు అందజేశారు. అసెంబ్లీలో

(మిగతా 2వ పేజీలో)

# ఎవరూ తప్పించుకోరు: సీఎం రేవంత్

## మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశాలిచ్చిన ప్రభుత్వం



**అవసరమైతే సీబీఐకూ సిద్ధమే : సీఎం**

**బీఆర్ఎస్ ఆందోళనలపై ఘాటైన ప్రతిస్పందన**

**సభలో గందరగోళంపై అసహనం.. కఠిన చర్యలకు హెచ్చరిక**

**సభను సజావుగా నడవనివ్వాలన్న స్పీకర్‌కు మద్దతు**

హైదరాబాద్, మార్చి 30: రాష్ట్రంలో 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన మైనింగ్ లావాదేవీలన్నింటిపై సమగ్ర విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే సీబీసీఐడీకి ఆదేశాలు జారీ చేసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ విచారణపై ప్రతిపక్షానికి ఎలాంటి అనుమానాలు ఉన్నా, అవసరమైతే కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ చేత దర్యాప్తు జరిపించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. "సీబీసీఐడీ వద్దంటే సీబీఐ కావాలా? అడిగితే వేస్తాం" అంటూ ఆయన అసెంబ్లీ వేదికగా సవాల్ విసిరారు.

మైనింగ్ అక్రమాలపై సభాసంఘం ఏర్పాటు చేయాలని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వరుసగా ఆందోళనలకు దిగుతున్న నేపథ్యంలో సీఎం ఘాటుగా స్పందించారు. సభలో పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ సభ్యుల తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. సభను అడ్డుకోవడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. "మీ పప్పులు ఇక్కడ ఉడకవు.. మీ మంత్రాలకు చింతకాయలు రాలవు" అంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి లేదా ఆయన కుటుంబ సభ్యులు, లేదా తమ కుటుంబానికి చెందిన ఎవరికైనా మైనింగ్ అక్రమాలతో సంబంధం ఉందని ఎవరికైనా సమాచారం ఉంటే నిర్భయంగా సీబీసీఐడీకి ఆధారాలు ఇవ్వాలని సీఎం సూచించారు. అదే విధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులకు సంబంధించిన మైనింగ్ వ్యవహారాల్లోనూ ఎలాంటి అక్రమాలు ఉన్నా వాటిని కూడా దర్యాప్తులో భాగం చేస్తామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో జరిగిన లావాదేవీలను కూడా పూర్తిగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు సహా అందరూ విచారణకు సహకరించాలని కోరారు.

రాఘవ కన్‌స్ట్రక్షన్స్ విషయంలో ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుని పన్నులు, చార్జీలు వసూలు చేసినట్లు సీఎం వివరించారు. 2025లోనే వాస్తవ పరిస్థితులను గుర్తించి మైనింగ్ శాఖ చర్యలు తీసుకుందని, ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ చర్యలను విపక్షం తమే బయటపెట్టినట్టు ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను తీసుకుని రాజకీయంగా వినియోగించుకోవడం తగదని విమర్శించారు.

సభాసంఘం ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను కూడా సీఎం తీవ్రంగా విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సభాసంఘాలను ఉపయోగించి రాజకీయ లబ్ధి పొందిందని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు నడిపిందని ఆరోపించారు. అందుకే ఈసారి నేరుగా విచారణ సంస్థకు

(మిగతా 2వ పేజీలో)

## పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచానికి కొత్త సవాళ్లు:ప్రధానమంత్రి మోదీ



సంక్షోభాన్ని రాజకీయం చేయొద్దని విపక్షాలకు హెచ్చరిక

వదంతులు నమ్మవద్దని ప్రజలకు ప్రధాని విజ్ఞప్తి

'మన్‌కీ బాత్'లో ఐకమత్యం అవసరమని స్పష్టం

గల్ఫ్‌లో ఉన్న భారతీయుల భద్రతపై ఆందోళన

కరోనా సమయంలోలాగే కలిసి ఎదుర్కోవాలన్న సూచన



## విద్యార్థినిపై టీచర్ అఘాయిత్యం..

::: వీడియో తీసి మరో టీచర్ బ్లాక్‌మెయిల్!

## తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జీతంలో 15% కట్...

అసెంబ్లీలో చారిత్రాత్మక బిల్లుకు ఆమోదం





## టీవీకే అభ్యర్థుల జాబితా విడుదల..

**పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నుంచి విజయ్ పోటీ**

**మొత్తం 234 స్థానాల్లో టీవీకే అభ్యర్థుల ప్రకటన**

చెన్నై, మార్చి 29: తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల సమరం ఉత్కంఠభరితంగా మారుతున్న నేపథ్యంలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) తమ అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. పార్టీ అధినేత విజయ్ స్వయంగా రెండు కీలక నియోజకవర్గాలైన పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. మొత్తం 234 అసెంబ్లీ స్థానాల్లో టీవీకే అభ్యర్థులను

(మిగతా 2వ పేజీలో)

## కేటీఆర్‌తో రేవంత్ మధ్య రహస్య ఒప్పందం : బండి సంజయ్

**కేటీఆర్‌పై కేసులు పట్టించుకోకపోవడంపై ప్రశ్నలు**

**హరీశ్‌రావునే టార్గెట్ చేస్తోందని ప్రభుత్వంపై విమర్శ**

**కాళేశ్వరం మొత్తం స్కామ్‌పై విచారణకు వెనుకడుగు**

**ఫార్ములా--ఈ, డ్రగ్స్, ఫాంహౌజ్ కేసులపై మౌనం ఎందుకని నిలదీత**

**భవిష్యత్తులో కాంగ్రెస్--బీఆర్ఎస్ పొత్తు సాధ్యం: సంజయ్**



హైదరాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ కారణంగానే కేటీఆర్‌పై ఉన్న అవినీతి కేసులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేవలం హరీశ్‌రావును లక్ష్యంగా చేసుకుని కాళేశ్వరం ప్రాజెక్టులోని కొన్ని భాగాలపై మాత్రమే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన సంజయ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన రూ.లక్ష కోట్ల అవినీతిపై పూర్తి స్థాయి విచారణ జరిపితే అసలు నిజాలు బయటపడతాయని

(మిగతా 2వ పేజీలో)




# అమెరికా అవాక్స్ ధ్వంసం

**ఇరాన్ దాడిలో అమెరికా నిఘా విమానానికి భారీ నష్టం**

**'ఈ-3 సెంట్రీ' కోల్పోవడం వాషింగ్టన్‌కు గట్టి ఎదురుదెబ్బ**

**గగనతల కమాండ్ సెంటర్‌గా పనిచేసే అవాక్స్ నాశనం**

**ఇజ్రాయెల్--ఇరాన్ పరస్పర దాడులతో ఉద్రిక్తతలు తీవ్రం**

**అమెరికా అదనపు బలగాల మోహరింపు వేగవంతం**

**రష్యా సహాయం ఆరోపణలు.. జెలెన్స్కీ వ్యాఖ్యలు సంచలనం**

**పాకిస్థాన్‌లో కీలక దేశాల విదేశాంగ మంత్రుల చర్చలు**

దుబాయ్, మార్చి 30: పశ్చిమాసియా యుద్ధంలో అమెరికాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై ఇరాన్ జరిపిన దాడిలో అగ్రరాజ్యానికి చెందిన అత్యాధునిక నిఘా విమానం 'బోయింగ్ ఈ-3 సెంట్రీ' తీవ్రంగా ధ్వంసమైంది. అమెరికా, దాని మిత్రదేశాల సైనిక కార్యకలాపాలకు కీలకంగా పనిచేసే ఈ 'ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (అవాక్స్)' విమానం నష్టం వ్యూహాత్మకంగా

(మిగతా 2వ పేజీలో)

# రేవంత్ పాలనలో 19 స్కామ్‌లు..

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన సంస్థపై అక్రమ మైనింగ్ ఆరోపణలతో బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేస్తున్న సమయంలోనే ఈ లేఖను స్పీకర్‌కు అందజేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తమ లేఖను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పంపాలని బీఆర్ఎస్ సభ్యులు కోరారు. లేఖలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అవినీతి, కుంభకోణాలకు కేంద్రంగా మారిపోయిందని ఆరోపించారు. దాదాపు అన్ని శాఖల్లో అక్రమాలు, అవినీతి, అధికార దుర్వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ అక్రమాలను అడ్డుకోవాల్సిన వారే దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. మంత్రులే ఈ కుంభకోణాల్లో నేరుగా ప్రమేయం ఉన్నారనే ఆరోపణలు రావడం ప్రజాస్వామ్యానికి తీవ్ర అవమానమని బీఆర్ఎస్ పేర్కొంది. ఈ అక్రమాల వల్ల రూ.వేల కోట్ల ప్రజా ధనం కొద్దిమంది చేతుల్లోకి మళ్లిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. నియంత్రణ లేకుండా జరుగుతున్న ఈ దోపిడీ ప్రభుత్వం నిర్లక్ష్యమా లేదా ప్రోత్సాహమా అన్న అనుమానాలు ప్రజల్లో పెరుగుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. శాసనసభలో అవినీతి అంశాలపై లేఖ రాస్తే విచారణ జరిపిస్తామని సీఎం స్వయంగా చెప్పిన విషయాన్ని గుర్తుచేసింది. ఆ ప్రకటన నేపథ్యంలో కాంగ్రెస్ పాలనలో జరిగిన ప్రధాన కుంభకోణాల వివరాలను సమర్పిస్తున్నామని తెలిపింది. చిత్తశుద్ధి ఉంటే వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. పౌర సరఫరాలు, అమృత్ టెండర్లు, కేఎల్ఎస్ఆర్, నైనీ కోల్ బ్లాక్, సింగరేణి, సోలార్ పవర్, ఎన్‌టీపీసీ థర్మల్ పవర్, హెచ్‌సీయూ, లగచర్ల భూసంబంధిత వ్యవహారాలు, కోటి ఎకరాల భూమి నిషేధిత





జాబితా, హ్యామ్ రోడ్లు, ఫోర్త్ సిటీ, హిల్ట్--పీ, అక్రమ మైనింగ్ తదితర అంశాల్లో అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ అన్ని అంశాలపై నిష్పక్షపాత విచారణ జరగాలని కోరింది. నిష్పక్షపాత దర్యాప్తు జరగాలంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ప్రజా ధనాన్ని రక్షించడం, అవినీతి అక్రమాలను అరికట్టడం రాజ్యాంగబద్ధమైన ముఖ్యమంత్రిగా మీ బాధ్యత అని లేఖలో స్పష్టం చేసింది. ఈ పరిణామంతో రాష్ట్ర రాజకీయాల్లో మైనింగ్ అక్రమాలు, అవినీతి ఆరోపణలు మరింత వేడెక్కే అవకాశం కనిపిస్తోంది.

## పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచానికి కొత్త సవాళ్లు: ప్రధానమంత్రి మోదీ



న్యూఢిల్లీ, మార్చి 29 : పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, భారత్‌కు కూడా ఇది పరీక్షల సమయమేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇలాంటి సంక్షోభ సమయంలో దేశ ప్రజలంతా చేయి చేయి కలిపి ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితులను రాజకీయంగా మలచకూడదని విపక్షాలకు హెచ్చరించారు. 'మన్‌కీ బాత్' 132వ ఎపిసోడ్‌లో మాట్లాడిన ప్రధాని, దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి ప్రజల ఐకమత్యమే ప్రధాన బలం అని స్పష్టం చేశారు. స్వార్థపూరిత రాజకీయాలకు ఇది సమయం కాదని, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. వదంతులను నమ్మకుండా ప్రభుత్వ అధికారిక సమాచారాన్నే ప్రజలు విశ్వసించాలని సూచించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ప్రభుత్వం నిరంతరాయంగా సమాచారాన్ని అందిస్తోందని, ప్రజలు ఆ సమాచారాన్ని అనుసరించి జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. గతంలో కరోనా మహమ్మారి సమయంలో దేశ ప్రజలు ఐక్యంగా వ్యవహరించి విజయవంతంగా పరిస్థితులను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. అదే విధంగా ఇప్పుడు కూడా ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న కోటి మందికిపైగా భారతీయుల గురించి ప్రస్తావిస్తూ, ప్రస్తుత సంక్షోభ సమయంలో ఆయా దేశాలు వారికి అండగా నిలుస్తున్నాయని తెలిపారు. గల్ఫ్ దేశాల సహకారం అభినందనీయమని, వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఇదిలా ఉండగా, ప్రపంచ సంక్షోభ సమయంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందని మోదీ విమర్శించారు. పశ్చిమాసియా యుద్ధంపై ఆ పార్టీ చేస్తున్న వ్యాఖ్యలు ప్రమాదకరమని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల భద్రతకు భంగం కలిగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక తెలంగాణలోని మంచిర్యాల జిల్లా ముదిగుంట గ్రామాన్ని జల సంరక్షణలో ఆదర్శంగా నిలిచిందని ప్రధాని ప్రశంసించారు. గ్రామంలోని 400 కుటుంబాలు తమ ఇళ్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడంతో భూగర్భ జలమట్టం పెరిగిందని, కాలుష్యంతో వచ్చే వ్యాధులు తగ్గాయని పేర్కొన్నారు. ఇది ప్రజా భాగస్వామ్యంతో సాధ్యమైన గొప్ప మార్పు అని కొనియాడారు. దేశ యువత ప్రతిభను కూడా ప్రధాని ప్రశంసించారు. 'బడ్జెట్ క్వెస్ట్' కార్యక్రమంలో తెలంగాణ యువత ప్రతిభ కనబరిచిందని చెప్పారు. సూర్యాపేటకు చెందిన కోట్ల రఘువీర్‌రెడ్డి రైతుల సంక్షేమంపై రాసిన వ్యాసం తనను ఆకట్టుకుందని పేర్కొన్నారు. యువత ఆలోచనలు దేశ అభివృద్ధికి దారితీస్తాయని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో మత్స్యకారుల పాత్రను కూడా మోదీ ప్రశంసించారు. వారు కేవలం సముద్రపు యోధులే కాకుండా ఆత్మనిర్భర భారత్‌కు బలమైన పునాదులని అభివర్ణించారు. దేశ అభివృద్ధిలో ప్రతి వర్గం పాత్ర కీలకమని ఆయన స్పష్టం చేశారు.

# అమెరికా అవాక్స్ ధ్వంసం



పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. ఈ విమానం సాధారణ యుద్ధవిమానం కాదు. బోయింగ్--707 మోడల్‌లో మార్పులు చేసి గగనతలంలో తిరిగే కమాండ్ సెంటర్‌లా రూపొందించారు. శత్రుదేశాల విమానాలు, డ్రోన్లు, క్షిపణుల కదలికలను వందల కిలోమీటర్ల దూరం నుంచే గుర్తించే సామర్థ్యం దీనికి ఉంది. గగనతలంలో సుమారు 250 మైళ్ల పరిధిలో జరిగే కార్యకలాపాలను పర్యవేక్షించే ఈ అవాక్స్‌ను కోల్పోవడం అమెరికా నిఘా వ్యవస్థకు పెద్ద లోటుగా మారింది. ప్రస్తుతం అమెరికా వద్ద పనిచేస్తున్న ఈ-3 సెంట్రీ విమానాలు కేవలం 16 మాత్రమే ఉండగా, కోల్పోయిన విమానాన్ని భర్తీ చేయడానికి సుమారు 70 కోట్ల డాలర్లు (దాదాపు రూ.6 వేల కోట్లు) ఖర్చవుతుందని అంచనా. గల్ఫ్ ప్రాంతంలో నిఘా కార్యకలాపాలు తాత్కాలికంగా దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, యుద్ధం మరింత ఉధృతమవుతోంది. ఇజ్రాయెల్ ఇరాన్‌లోని పలు విశ్వవిద్యాలయాలపై వైమానిక దాడులు జరపగా, ప్రతీకారంగా ఇజ్రాయెల్ యూనివర్సిటీలు, అలాగే పశ్చిమాసియాలో ఉన్న అమెరికా విద్యాసంస్థల శాఖలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ హెచ్చరించింది. అమెరికా భూతల యుద్ధానికి సిద్ధమవుతున్న సంకేతాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. 3,500 మంది మెరైన్లతో కూడిన యూఎస్ఎస్ ట్రిపోలి యుద్ధనౌక పశ్చిమాసియాకు చేరుకోగా, యూఎస్ఎస్ హెచ్.డబ్ల్యు. బుష్ విమానవాహక నౌక కూడా ఆ దిశగా కదులుతోంది. అదనపు బలగాల మోహరింపు వేగవంతమైంది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ అమెరికాకు ఘాటైన హెచ్చరికలు జారీ చేశారు. తమ భూభాగంలో అడుగుపెట్టే అమెరికా సైనికులను తీవ్రంగా ఎదుర్కొంటామని, వారిని అగ్నికి ఆహుతి చేస్తామని పేర్కొన్నారు. అమెరికాకు మద్దతుగా నిలిచే ప్రాంతీయ మిత్రదేశాలపై కూడా దాడులు తప్పవని హెచ్చరించారు. ఇక రష్యా పాత్రపై కూడా వివాదం చెలరేగింది. ప్రిన్స్ సుల్తాన్ స్థావరానికి సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను ఇరాన్‌కు రష్యానే అందించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆరోపించారు. పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకునేలా మాస్కో సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. యుద్ధం కొనసాగుతూనే దౌత్యపరమైన ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. పాకిస్థాన్‌లో ఈజిప్టు, తుర్కియే, సౌదీ అరేబియా విదేశాంగ మంత్రులు సమావేశమై పరిస్థితులపై చర్చించారు. అమెరికా-ఇరాన్ మధ్య ప్రత్యక్ష శాంతిచర్చలు జరిపే అవకాశాలపై సమాలోచనలు నిర్వహించారు. ఇదిలా ఉండగా, ఇరాన్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. దక్షిణ ఇజ్రాయెల్‌లోని బీర్షెబా ప్రాంతంలో క్షిపణి దాడులతో భారీ అగ్ని ప్రమాదం సంభవించగా, పలువురు గాయపడ్డారు. జోర్డాన్‌లోని అమెరికా స్థావరాలపై కూడా డ్రోన్ దాడులు జరిగాయి. ఇరాక్‌లో కుర్దిస్థాన్ ప్రాంతీయ నాయకుడి నివాసంపై దాడి యత్నం చోటుచేసుకుంది. ఈ పరిణామాలన్నీ పశ్చిమాసియాలో యుద్ధం మరింత విస్తరించే ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. ఒకవైపు దాడులు, మరోవైపు శాంతి ప్రయత్నాలు కొనసాగుతుండటంతో పరిస్థితి అనిశ్చితంగా మారింది. ప్రపంచ దృష్టి మొత్తం ఇప్పుడు ఈ ప్రాంతంపైనే కేంద్రీకృతమైంది.

### అజ్ఞాతం వీడని సుప్రీం లీడర్..
### ఉద్రిక్తతల నడుమ ఇరాక్‌కు లిఖితపూర్వక కృతజ్ఞతలు

ఇరాన్ నూతన అత్యున్నత నాయకుడు మొజ్తబా ఖమేనీ బతికే ఉన్నారా? అసలు ఆయన ఎక్కడున్నారు? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది? తన తండ్రి, మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణానంతరం బాధ్యతలు చేపట్టి నెల రోజులు గడుస్తున్నా ఆయన ప్రజల ముందుకు రాకపోవడంతో ఈ ప్రశ్నలు అంతర్జాతీయ రాజకీయ వర్గాలను ఉత్కంఠకు గురిచేస్తున్నాయి. "అతను బతికున్నాడో లేదో కూడా మాకు తెలియదు" అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సంచలన వ్యాఖ్యలు ఈ అనుమానాలకు మరింత ఆజ్యం పోశాయి. ఈ నేపథ్యంలో మొజ్తబా నుంచి తాజాగా ఓ కొత్త సందేశం వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా, ఇజ్రాయెల్‌తో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో తమకు మద్దతుగా నిలుస్తున్న ఇరాక్‌కు మొజ్తబా ఖమేనీ తన ప్రశంసలు తెలిపారు. ఇరాక్‌లోని మత పెద్దలు, ప్రభుత్వానికి, ప్రజలకు ఆయన లిఖితపూర్వకంగా కృతజ్ఞతలు చెప్పినట్లు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ 'ఇస్నా' ఆదివారం ప్రకటించింది. ముఖ్యంగా, షియా ప్రపంచంలో అత్యంత గౌరవనీయులైన గ్రాండ్ అయతొల్లా అలీ సిస్తానీ వైఖరిని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. బాగ్దాద్‌లోని ఇరాన్ రాయబారి ఈ సందేశాన్ని ఇరాక్ ప్రభుత్వ వర్గాలకు అందజేశారు. ఫిబ్రవరి 28న జరిగిన వైమానిక దాడిలో అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. అదే దాడిలో మొజ్తబా కూడా తీవ్రంగా గాయపడ్డారని, అందుకే ఆయన కోలుకోవడానికి సమయం పడుతోందని, అందువల్లే ప్రజల ముందుకు రావడం లేదని టెహ్రాన్ వర్గాల అనధికారిక కథనం. సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన రెండుసార్లు సందేశాలు ఇచ్చినా, వాటిని టీవీలో ఇతరులే చదివి వినిపించారు. ఆయన స్వయంగా కనిపించకపోవడంతో ఆరోగ్యంపై ఊహాగానాలు బలపడ్డాయి. ఇదే సమయంలో, మొజ్తబా ఉనికిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ ఉత్కంఠను మరింత పెంచాయి. "మేం ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నాం. కానీ అది సుప్రీం లీడర్‌తో కాదు. ఆయన కుమారుడి (మొజ్తబా) నుంచి మాకు ఎలాంటి సమాచారం లేదు. అతను బతికున్నాడో లేదో కూడా తెలియదు," అంటూ ట్రంప్ వ్యాఖ్యానించడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మొత్తంమీద, ఈ తాజా సందేశం ద్వారా మొజ్తబా క్రియాశీలకంగానే ఉన్నారని చెప్పే ప్రయత్నం ఇరాన్ చేసినప్పటికీ, ఆయన స్వయంగా ప్రజల ముందుకు వచ్చి ప్రసంగించే వరకు ఆయన ఆరోగ్య పరిస్థితి, భద్రతపై నెలకొన్న ఉత్కంఠకు మాత్రం తెరపడదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### విద్యార్థినిపై టీచర్ అఘాయిత్యం..
### వీడియో తీసి మరో టీచర్ బ్లాక్‌మెయిల్!



పదో తరగతి విద్యార్థినిపై ఉపాధ్యాయుడు అత్యాచారానికి పాల్పడటం, ఈ దారుణాన్ని మరో ఉపాధ్యాయుడు రహస్యంగా వీడియో తీసి బ్లాక్‌మెయిల్‌కు యత్నించడం నారాయణపేట జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు, సర్పంచ్ భర్తతో సహా మొత్తం ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ వినీత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం మద్దూరు మండలం మోమినాపూర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చండేపల్లి స్వామి, అదే పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినిని లోబర్చుకుని పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. స్వామితో వ్యక్తిగత విభేదాలున్న మరో ఉపాధ్యాయుడు గురునాథ్ రెడ్డి, వీరిద్దరూ కంప్యూటర్ గదిలో అసభ్యంగా ప్రవర్తిస్తున్న దృశ్యాలను రహస్య కెమెరాతో చిత్రీకరించాడు. అనంతరం గురునాథ్ రెడ్డి ఈ వీడియోను స్థానిక సర్పంచ్ భర్త గూళ్ల రవికి పంపాడు. దీంతో రవి తన అనుచరులైన ఆనంద్, విజయ్ కుమార్, మేకల రవిలతో కలిసి ఉపాధ్యాయుడు స్వామి, గురునాథ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు చెన్నకేశవులను డబ్బు కోసం బెదిరించాడు. వారి మధ్య ఒప్పందం కుదరకపోవడంతో నిందితులు ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మార్చి 26న ఈ వీడియో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై విద్యాశాఖ విచారణ జరిపి పోలీసులకు ఫిర్యాదు చేసింది. డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, బాలికపై స్వామి అత్యాచారం చేసినట్లు నిర్ధారించారు. నేరంలో భాగమైన స్వామి, గురునాథ్ రెడ్డి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెడ్ మాస్టర్ చెన్నకేశవులు, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన సర్పంచ్ భర్త గూళ్ల రవితో పాటు అతని ముగ్గురు అనుచరులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసులు నమోదు చేసి, వారి నుంచి మొబైల్ ఫోన్లు, సీసీ కెమెరాను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

### ఎవరూ తప్పించుకోరు: సీఎం రేవంత్

బాధ్యతలు అప్పగించామని తెలిపారు. సభాసంఘం వేసినా చివరికి అదే విషయం మరో విచారణ సంస్థకు వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. దళితుల అంశాన్ని ప్రస్తావిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఏర్పడితే దళితుడిని సీఎం చేస్తానని చెప్పి తర్వాత ఆ హామీని విస్మరించారని కేసీఆర్‌పై విమర్శించారు. దళితులు సీఎం కావడానికి అర్హులు కారన్నట్లుగా వ్యవహరించారని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం దళితులకు పెద్దపీట వేస్తోందని, భట్టి విక్రమార్కను డిప్యూటీ సీఎంగా, ఆర్థిక మంత్రిగా నియమించడమే దానికి ఉదాహరణ అని పేర్కొన్నారు. సభలో జరుగుతున్న గందరగోళంపై సీఎం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సభను నడవనివ్వకుండా అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. స్పీకర్‌ను గౌరవించకపోవడం సరికాదని, సభా పరిపాటిని కాపాడటం ప్రతి సభ్యుడి బాధ్యత అని అన్నారు. అవసరమైతే సస్పెన్షన్ వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పీకర్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ సభను సజావుగా కొనసాగించేందుకు అన్ని పార్టీలూ సహకరించాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం కనుగొనాలని, ఆ దిశగా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## టీవీకే అభ్యర్థుల జాబితా విడుదల..

ప్రకటించగా, విల్లివాక్కం నియోజకవర్గం నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శి అర్జున బరిలోకి దిగనున్నారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా డీఎంకే, టీవీకే మధ్య నేరుగా పోరు ఉండబోతుందని విజయ్ పేర్కొన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన లక్ష్యం ప్రజాసేవేనని, రాష్ట్రంలో వాలంటరీ వ్యవస్థను ప్రవేశపెడతామని విజయ్ వెల్లడించారు. ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా తమ పార్టీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. టీవీకే పార్టీ స్థాపన అనంతరం విజయ్ ఎదుర్కొంటున్న తొలి ఎన్నికల సమరం ఇదే కావడం విశేషం. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నుంచి పోటీ చేయాలనే నిర్ణయంతో ఆ నియోజకవర్గాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. పార్టీ కేడర్‌ను బలోపేతం చేయడంతో పాటు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నారు. అయితే, పెరంబూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు విజయ్ రూపొందించిన కార్యాచరణకు అధికారులు అనుమతి నిరాకరించడం వివాదానికి దారితీసింది. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన ఆయన ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదులో బ్యూరోక్రటిక్ వ్యవస్థ రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందని, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. అధికారులు తమ బాధ్యతలను విస్మరిస్తున్నారని విమర్శించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం వాటిల్లుతుందని హెచ్చరించారు. ఈ పరిణామాలతో తమిళనాడు రాజకీయాల్లో టీవీకే ఎంట్రీతో పోరు మరింత రసవత్తరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కేటీఆర్‌తో రేవంత్ మధ్య రహస్య ఒప్పందం : బండి సంజయ్

పేర్కొన్నారు. కానీ అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ వంటి కొన్ని భాగాలకే విచారణను పరిమితం చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. మొత్తం వ్యవహారం వెలుగులోకి రాకూడదనే ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్‌ను దేశంలోనే అతిపెద్ద అవినీతిపరుడిగా అభివర్ణిస్తూ బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాల్లో అవినీతి జరిగిందని సంజయ్ విమర్శించారు. కేటీఆర్‌పై ఉన్న ఆరోపణలు తెలిసినా సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇద్దరి మధ్య ఏదైనా గోప్య ఒప్పందం ఉందా అని నిలదీశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య కుమ్మక్కు రాజకీయాలు కొనసాగుతున్నాయని సంజయ్ ఆరోపించారు. హరీశ్‌రావుపై జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్‌కు సీఎం సూచిస్తున్నారని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి హరీశ్‌పై ఉన్నంత వ్యతిరేకత కేటీఆర్‌పై లేదని, అందుకే ఫార్ములా-ఈ కేసు, డ్రగ్స్, ఫాంహౌజ్ కేసులపై మాట్లాడటం లేదన్నారు. కేటీఆర్, కవిత మధ్య సర్దుబాటు చేయించేందుకు కూడా సీఎం ప్రయత్నిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌తో కలిసి ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనతోనే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయమని అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అవసరమైన నిధులను రేవంత్‌రెడ్డి సమకూరుస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కర్ణాటక నుంచి డబ్బులు రావడం లేదని, ఇతర మార్గాల్లో నిధులు సమీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై కూడా సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై ఉన్న పగ కూడా రేవంత్‌రెడ్డికి తగ్గిపోయిందని సంజయ్ విమర్శించారు. గతంలో తనను జైలుకు పంపించిన విషయాన్ని కూడా మర్చిపోయారని అన్నారు. ఇకపై కేసీఆర్, కేటీఆర్‌లపై అవినీతి కేసుల్లో విచారణ జరిగే అవకాశాలు లేవని అభిప్రాయపడ్డారు. బీజేపీ-బీఆర్ఎస్ పొత్తు జరగదని స్పష్టం చేస్తూ కుటుంబ పాలనకు తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకమని తెలిపారు. కేసీఆర్ కుటుంబ అవినీతిని అంతం చేయాలనే లక్ష్యంతోనే పోరాడామని పేర్కొన్నారు.

## తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జీతంలో 15% కట్

### అసెంబ్లీలో చారిత్రాత్మక బిల్లుకు ఆమోదం

హైదరాబాద్, మార్చి 30: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల పట్ల తెలంగాణ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుంది. అలాంటి వారి జీతంలో 15 శాతం వరకు కోత విధించేందుకు ఉద్దేశించిన కీలక బిల్లును ఆదివారం తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులకు కూడా ఈ చట్టం వర్తించనుంది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, వయోవృద్ధుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సభలో "తెలంగాణ ఎంప్లాయీస్ అకౌంటబిలిటీ అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ బిల్లు, 2026"ను ప్రవేశపెట్టగా, సభ్యులందరూ దీనికి మద్దతు తెలిపారు. ఈ కొత్త చట్టం ప్రకారం, తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని తేలిన ఉద్యోగుల స్థూల జీతం (గ్రాస్ శాలరీ) నుంచి 15 శాతం కోత విధిస్తారు. ఈ మొత్తాన్ని నేరుగా వారి తల్లిదండ్రులకు చెల్లిస్తారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, వృద్ధ తల్లిదండ్రులకు రక్షణ కల్పించడంలో ఈ బిల్లు ఒక చరిత్రాత్మక ముందడుగు అని అభివర్ణించారు. సమాజంలో మానవ సంబంధాలు, బంధుత్వాలు బలహీనపడి, కేవలం సంపాదన, భౌతిక సుఖాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "కన్నవారు కన్నీరు పెట్టే పరిస్థితి రావడం సమాజానికి మంచిది కాదు. తల్లిదండ్రులను గౌరవించని వారిలో భయం కలిగించేందుకే ఈ చట్టాన్ని తీసుకొచ్చాం" అని సీఎం స్పష్టం చేశారు. 2007లో కేంద్రం చట్టం తెచ్చినా ఆశించిన ఫలితాలు రాలేదని, అందుకే ఈ బిల్లును ఒక సామాజిక బాధ్యతగా తీసుకొచ్చామని తెలిపారు. "ఏ ఒక్క తల్లి లేదా తండ్రి తమ చివరి రోజుల్లో నిరాశ్రయులు కాకూడదన్నదే మా ఉద్దేశం" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమాజంలో ఏ కుటుంబంలోనూ తల్లిదండ్రులు అనాథలుగా మిగిలిపోకూడదన్న బలమైన సంకల్పంతోనే ఈ రోజు శాసనసభలో ఒక కీలకమైన బిల్లును ప్రవేశపెట్టాం. వృద్ధాప్యంలో కన్నవారికి అండగా నిలవాలనే బాధ్యత, భావోద్వేగంతో ఆలోచించి "తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటబిలిటీ, మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ బిల్లు - 2026"ను సభ ముందుకు తీసుకొచ్చాం. తల్లిదండ్రుల పట్ల భక్తి లేనివారిలో భయాన్ని కలిగించడమే ఈ చట్టం ఉద్దేశం. ఈ రోజుల్లో మనిషి బంధాలు, అనుబంధాలను మరిచిపోయి భౌతిక సుఖాల కోసం పాకులాడుతున్నాడు. చివరికి పేగుబంధాన్ని కూడా విస్మరిస్తున్నాడు. కన్నవారి కన్నీళ్లు ఈ సమాజానికి అస్సలు మంచిది కాదు. పిల్లలు, మహిళల రక్షణ కోసం మన దేశంలో ఎన్నో చట్టాలున్నాయి. కానీ వృద్ధుల సంరక్షణ విషయంలో ఉన్న చట్టాలు సరిపోవడం లేదు. బతికున్నప్పుడు గుక్కెడు మెతుకులు పెట్టని బిడ్డలు, వారు పోయాక ఆస్తుల కోసం కొట్లాడుకోవడం చూస్తుంటే చాలా బాధగా ఉంటుంది.

# దుండిగల్ సర్కిల్ బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పర్యటన



కుత్బుల్లాపూర్ మార్చ్ 29(వాయిస్ టుడే ): మున్సిపల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి అధ్యక్షతన దుండిగల్,గండి మైసమ్మ, బహదూర్ పల్లి గ్రామాలలో మూడు చోట్ల డబుల్ బెడ్రూంలో సమస్యలపై పర్యటించి వారికి భరోసా కల్పించిన ఎంపీ ఈటెల రాజేందర్ ఎంపీ ఈటల గారు మాట్లాడుతూ దుండిగల్ లో డబుల్ బెడ్రూలలో 37 బ్లాక్ లు 4000 కుటుంబాలు 15 వేల పైగా జనాభా అంటే ఒక చిన్న మున్సిపాలిటీ జనాభా కానీ ఇక్కడ ఇండ్లు కేటాయించిన తర్వాత ప్రజలు ఇక్కడ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని నా దృష్టికి వచ్చింది మీ సమస్యలు ఇప్పటికే ప్రభుత్వం మరియు మంత్రుల దృష్టికి కూడా తీసుకుపోవడం జరిగింది నా దగ్గరికి వస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని నేనేమీ దగ్గరికి వచ్చి ఒకసారి మీ సమస్యలు చూస్తానని నీకు ఆమె ఇచ్చినాను కాబట్టి నేను ఈరోజు మీ దగ్గరికి వచ్చాను అన్నారు.

ఇక్కడున్నవారు అందరూ నిరుపేదలే ఎక్కడో పొట్ట చేత పట్టుకొని వచ్చి కూలోనాలో చేసుకుందామంటే ఇక్కడ సరైన పని లేక ఎక్కడో ఉన్న వ్యాపారాలు గాని ఉద్యోగాలు గాని వదిలి ఇక్కడికి రావడం మళ్ళీ అక్కడ వెళ్లి పని చేసుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కాబట్టి ఇక్కడ ఏవైతే షెటర్లు ఉన్నాయో వాటిని రాష్ట్ర ప్రభుత్వం బయటి వారికి టెండర్లు పిలుస్తామంటే దానికి నేను ఒప్పుకోలేదు అవి స్థానికులకే కేటాయించాలి ఇక్కడ ఏవైతే అంగన్వాడి ఆశా వర్కర్ ప్రైమరీ స్కూల్, బస్తీ దవాఖాన ఏర్పాటు చేసి ఇక్కడి వారికే అందులో ఉద్యోగాలు ఇచ్చేలాగా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను ఇక్కడ ఇండ్లు ఇచ్చిన తర్వాత వారికి కావాల్సిన మౌలిక వసతులు మాత్రమే కాకుండా ఇచ్చిన దాంట్లో సరైన క్వాలిటీలు మెయింటైన్ చేయాల్సిన అవసరం కూడా ఉంది పైన స్లాపులు ఉరువడం పెచ్చులూడి మీద పడుతున్నాయి ఇళ్లలో నీరు వర్షపు నీరు వచ్చి జారిపడుతున్నారు లిఫ్టులు కొన్ని సంవత్సరాలు రిపేర్ చేసి వారికి అప్ప చెప్పాల్సిన అవసరం ఉంది ఎస్టీపీలు కూడా సరైన మెయింటెనెన్స్ లేక గల్లీలో మురికి వరదలు పారుతుంది ప్రజలు ఉండలేక నానా అవస్థలు రోగాల బారిన పడుతున్నారు మంచినీరు తాగడానికి లేక ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతి మనిషికి 135 లీటర్ల నీళ్లు ఇవ్వాల్సి ఉంది కానీ ఇప్పటికీ పది పైసల వంతు కూడా మీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఎంపీ లార్డ్స్ నిధులతో కొన్ని బోర్లు వేయించిన కానీ వారికి ఏమాత్రం సరిపోవు కాబట్టి మిషన్ భగీరథ నీళ్లను తక్షణమే కాలనీకి వచ్చేలా అనేక సమస్యలు




## వార్షికోత్సవాలు పిల్లల సృజనాత్మకతను వెలికితీస్తాయి

### వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రజిత పరమేశ్వర్ రెడ్డి

నాగారం, మార్చి 29:-( వాయిస్ టుడే): ఉప్పల్ డివిజన్ సాయిబాబా కాలనీ పాజిటివ్ స్కూల్, ఉప్పల్ గణేష్ నగర్ చైతన్య భరత హై స్కూల్, ఉప్పల్ సెవెన్ హిల్స్ శ్రీ కాకతీయ టెక్నో స్కూల్స్ వార్షికోత్సవం పిల్లల కోలాహలం, ఆనందోత్సవం మధ్య ఘనంగా జరిగాయి. ఈ వార్షికోత్సవ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు నాట్యం, పాటలు, డ్రామా కార్యక్రమాలతో వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వార్షికోత్సవం పాఠశాల పిల్లల యొక్క సృజనాత్మకతను ప్రోత్సహించే వేదికగా నిలుస్తుందన్నారు. ప్రతి కార్యక్రమం విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తుందన్నారు, వారిలో నాణ్యమైన మానవీయ విలువలను పెంపొందిస్తుందని, వారి అభివృద్ధి కోసం ఇటువంటి కార్యక్రమాలు జరగడం ఎంతో అవసరం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాజిటివ్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శోభన దేవి, టీచర్స్ నిర్మల, రమ్య, అత్య, కాకతీయ టెక్నో స్కూల్, కరస్పాండెంట్, కొండరాజు, ప్రిన్సిపాల్ కొండ సప్న , చైతన్య భారతి హై స్కూల్ కరస్పాండెంట్ వెంకన్న, సాయిబాబా కాలనీ అధ్యక్షులు అంజి రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి , ఆకారపు అరుణ్ పటేల్, తుమ్మల దేవి రెడ్డి, సుంకు శేఖర్ రెడ్డి, మోహన్ నాయక్, ప్రేమ్ గౌడ్, ప్రణయ్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి టీచర్లు, విద్యార్థులు, స్థానికులు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

### అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్



హైదరాబాద్, మార్చి 28: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని, మహిళా అభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి, మోటివేషన్ స్పీకర్ నైనా జైస్వాల్ అన్నారు. అఖిల భారత పద్మశాలి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు వనం దుష్యంతల అధ్యక్షతన శనివారం నారాయణగూడ లోని పద్మశాలి భవన్ లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలను ఘనంగా సత్కరించారు. వివిధ రకాల పోటీలు, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిలువేరు సునీత, మిర్యాల విశ్వరేఖ, బాసాని పద్మ, బండారు లక్ష్మీ, పొట్టబత్తిని అరుణ. వై. వాణి, గడ్డం కీర్తన, కొండబత్తిని కృష్ణా సంతోషి, పులి భువనేశ్వరి, భాగ్యలక్ష్మీ, బొమ్మ ప్రవళిక, వర్ణ లీల, అశ్వీత, స్రవంతి, యశోద, డాక్టర్ సమత, అమరావతి, సుజాత, రూపా సదాశివ్, శారద, పవిత్ర



వాణి, రచన, రేణుక, విజయ లక్ష్మీ, మాధవి, సంతోషి, పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

**సన్మాన గ్రహీతలు**

చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ పవిత్ర వాణి, న్యాయవాది రచన వడ్డేపల్లి, బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ సమత, ఎగ్జిబిషన్ సొసైటీ మెంబర్ వనం ఉష, సామాజిక కార్యకర్త బొమ్మ ప్రవల్లిక, లెక్చరర్ చందుబట్ల ప్రమీలాదేవి, షాద్‌నగర్ కౌన్సిలర్ వొగ్గు కీర్తన, మెరైన్ సైంటిస్ట్ పల్లె జ్యోత్స్న, సామాజిక కార్యకర్త బైరి అమరావతి, పోటీ చేసిన కార్పొరేటర్ పున్నా నిర్మలా గణేష్, క్రీడాకారులు అంబటి హాసిని, యూట్యూబర్ వనం సాయిజ్యోతి, యూట్యూబర్ దీపికా నరేష్, సూర్యకళా రెబ్బా, తదితరులను ఘనంగా సత్కరించి అభినందించారు.

# మాణికేశ్వర్ నగర్ లో ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



హైద్రాబాద్ (వాయిస్ టుడే):తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గం మానికేశ్వర్ నగర్ లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తార్నాక డివిజన్ టిడిపి అధ్యక్షుడు గండికోట విజయకుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి స్వీట్లు,పండ్లు పంచుకున్నారు. పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గండికోట విజయ్ కుమార్ మాట్లాడుతూ.. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో 4 దశాబ్దాల కిందట నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని ఆవిర్భవించారు.. పార్టీ పెట్టిన 9నెలలకే అధికారాన్ని స్థాపించి చరిత్ర సృష్టించారు.. ఎన్నో పథకాలను తీసుకొచ్చారు.. మహిళలకు అండగా నిలిచారు.. పేదలకు 2 రూపాయలకే కిలో బియ్యాన్ని అందించారు . .అంతే కాకుండా గవర్నమెంట్ బడులలో తిండి వసతిని కల్పించారు.. మద్యపానాన్ని నిషేధించారు.. అంతే కాకుండా తెలుగోడి సత్తా ఏంటో దేశానికి వెన్ను చాటాడు.. ఢిల్లీ అధిష్టానాన్ని సైతం వణుకుపుట్టించేలా చేశాడు.. తెలుగుదేశం పార్టీ అంటే తెలుగోడి ఆత్మ గౌరవానికి ప్రతీక.. మధ్యలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాడు.. అయినా సరే పట్టు వదల కుండా కృషి చేసి మళ్ళీ పార్టీ ని అధికారంలోకి తీసుకొచ్చారు.. ఈ సారి ప్రజలకి మరింత దగ్గర అయ్యారు.. కష్టం వచ్చిన ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచే వారు ..ప్రజలకి రామ రాజ్య పాలనను అందించారు.. అందరి గుండెల్లో సిరస్థాయిగా నిలిచిపోయారు.. తెలుగు ప్రజందరు దేవుడిలా ఆరాధించారు .. ఆ రోజుల్లో ఆయన ఫోటో లేని ఇల్లు ఉండేది కాదు.. అంతలా ఆరాధించారు .. ఆయన అకాల మరణం తర్వాత అల్లుడైన చంద్రబాబు నాయుడు పార్టీ పగ్గాలు చేపట్టారు..మామకు తగ్గ పాలనను ప్రజలకు అందించారు.. అంతే కాకుండా అభివృద్ధి అంటే ఏంటో ఆయన ప్రభుత్వంలో చూసాము.. ఇంకా ఎన్నో అభవృద్ధి పథకాలను తీసుకొచ్చారు.. రైతులకు అండగా నిలిచారు.. నిరుద్యోగుల పాలిట దేవుడిలా మారారు.. ప్రజలకు మంచి పాలన అందచేశారు..ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆలకుంట బుచ్చయ్య ,టిడిపి నగర్ యువత అధ్యక్షులు శ్యామ్ సుందర్ , రాష్ట్ర వాజ సెల్ కార్యదర్శి బొట్టు సురేష్ , గండికోట గిరిబాబు , సహదేవ , వీణ.నాసర్ , ప్రభాకర్ , నవీన్, పవన్ , విజయ్ , రాములు ,శివ ,రాజేష్ , మహేష్ , బాలాజీ ,సతీష్ , యాదగిరి , మల్లేష్ , బిట్టు , ఇందర్ , సాయి, తదితరులు పాల్గొన్నారు.



## శిల్ప కళాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

### 100 కోట్ల రూపాయలతో రామప్ప దేవాలయాని అభివృద్ధి చేయాలి

### బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి

నాచారం (వాయిస్ టుడే ):శిల్పాలను శిల్ప తోరణాలను అద్భుతంగా తొలసి అనేక దేవాలయాలు ప్రతిష్టకు శిల్ప కళాకారులు నిలిచారని బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కొనియాడారు. అలాంటి శిల్పకారుల పరిస్థితి దయనీయంగా మారుతుందని కేంద్ర ప్రభుత్వాలు స్పందించి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ రామప్ప దేవాలయాన్ని గణేష్ చారి సందర్శించారు. ఈ సందర్భంగా కళా నైపుణ్యాన్ని కళాకారుల కృషిని వివరిస్తూ ఇలాంటి శిల్ప కళలు ఎక్కడ చూడలేదన్నారు. తాజ్మహల్, అయోధ్య, తిరుమల తిరుపతి, వారణాసి ఇలా అనేక దేవాలయాలు కళాకారులతో ఏర్పాటు చేసిన కళా అద్భుతమని రాబోయే తరాలకు ఇది గొప్ప కానుకగా నిలుస్తుందని తెలిపారు. రామప్ప దేవాలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 100 కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోదండ రాములు, శ్రీహర్ష, ప్రభావతి, స్రవంతి, విజయలక్ష్మి, కౌశల్, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవం



నాగారం,మార్చి 29:-( వాయిస్ టుడే): తెలుగు దేశం పార్టీ 44 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఉప్పల్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ నియోజక వర్గం డా ఏ ఎస్ రావు నగర్ డివిజన్ లో మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జమ్మిగడ్డ యన్ టి ఆర్ సర్కిల్ దగ్గర స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి జెండా ఆవిష్కరణ చేసారు. బి జె ఆర్ కాలనీలో ఉన్న జెండాను ఎగరవేసి సౌత్ కమలానగర్ మెయిన్ రోడ్డు వద్ద నూతన జెండాను ఎగరవేసి సౌత్ కమలానగర్ రౌండ్ బిల్డింగ్ ఎదురుగా ఉన్న జెండాను ఆవిష్కరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గడ్డమిధి రాములు యాదవ్, తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరు కొండ సతీష్ బాబు, టి యన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర మాజీ జనరల్ సెక్రటరీ శివానంద్, డా ఏ ఎస్ రావునగర్ డివిజన్ మాజీ ఉపాధ్యక్షుడు మొవ్వ శ్రీనివాస కుమార్, మదమంచి బుచ్చయ్య చౌదరి, సీనియర్ నేతలు బింగి బిక్షపతి గౌడ్, కొమ్ము ఉపేందర్, గోబేరు రమేష్, పోట్ల సతీష్ కుమార్, ఉన్నం నవీన్ చౌదరీ, వడ్లమూడి శ్రీనివాస్, బొప్పన శ్రీనివాస్, వెంకట్ నాయుడు, వెంకటేష్, హరికృష్ణ దుర్గేష్, మోహిత్, కేతన్, రవి తదితరులు పాల్గొన్నారు.




## ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన మన్ కీ బాత్ 132 ఎపిసోడ్

నాచారం (వాయిస్ టుడే):ప్రజలతో ప్రతి నెల ప్రతిష్టాత్మకంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన మన్ కీ బాత్ 132 ఎపిసోడ్ కార్యక్రమాన్ని హెచ్ఎంటీ నగర్ డివిజన్ బీజేపీ నాయకురాలు శ్రీమతి పోతగాని విజయ గోపాల్ గౌడ్ స్థానిక మహిళలతో పాటు వీక్షించారు. ఈ కార్యక్రమం ద్వార జల సంరక్షణ – 'ఏక్ పేడ్ మా కే నామ్,పారా ఒలింపిక్స్ క్రీడాకారులకు అభినందనలు , మాతృభాష మరియు సంస్కృతి , డిజిటల్ అరెస్ట్ పట్ల జాగ్రత్త , వికసిత్ భారత్ – యువత భాగస్వామ్యం మొదలగు అనేక విషయాలను గురించి తెలుసుకున్నట్లు ఈ సందర్భంగా పోతగాని విజయలక్ష్మి గోపాల్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రమ్య ,ఉమ ,సుగుణమ్మ మరియు ఇతర నాయకులు, స్థానిక మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## గోరక్షా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

హైదరాబాద్, మార్చి 29: గోరక్షా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంలో ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమౌతోందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. భగవాన్ మహావీర్ జయంతి సందర్భంగా శ్రీజైన్ సేవా సంఘ్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ఆధ్వర్యంలో ఆదివారం గోశాలలకు పశుగ్రాసం, భోగార్పణ, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మహావీర్ అహింసా సిద్ధాంతం ప్రేరణతో గోవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు. గోసేవపై ప్రజల్లో అవగాహన కల్పించి గోవుల రక్షణ కోసం కృషి చేయాలని కోరారు. లయన్స్ ఇంటర్నేషనల్ జీవజంతు సంక్షేమ విభాగం చైర్మన్ ప్రేమ్చంద్ మునోత్ మాట్లాడుతూ మహావీర్ జయంతి సందర్భంగా గో సేవ ద్వారా అహింసా, కరుణ సందేశాలను సమాజానికి చాటుతున్నామని తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రదీప్ అగర్వాల్, అనురాధ అగర్వాల్, ఆదర్శ మునోత్, లక్ష్మీకాంత్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



# పోచమ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలి

## ఆకారపు అరుణ్ పటేల్

### రామ్‌రెడ్డి నగర్‌లో ఘనంగా పోచమ్మ తల్లి 12వ వార్షికోత్సవం

ఉప్పల్, మార్చి 29: వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ రాంరెడ్డి నగర్ కాలనీలో ఘనంగా శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం 12వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అరుణ్ పటేల్ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ వాసులందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారి ఆశీస్సులు అందరి పై ఉండాలని అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు అరుణ్ పటేల్ ని ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఇలాంటి వార్షికోత్సవాలు భక్తిని పెంపొందించడమే కాకుండా, కాలనీ ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కీర్తి సంతోష్ రాజ్, హరినేత్రం, లింగమూర్తి, చందర్ రాయుడు, రమేష్, వెంకటేష్, చేవెళ్ల మల్లయ్య, రవీందర్ రెడ్డి, టిల్లు గొడ్కె సత్తయ్య, సిద్దు రాజు, భాను, సురేష్, సిద్ధూ, భాస్కర్, అశోక్, చోట, రాజేష్, నాని, సాయి, మిట్టు, చిరు, సునీత, సుజాత, ప్రభావతి, కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్తు

హైదరాబాద్, మార్చి 29: ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుండే లక్ష్యాన్ని ఎం చుకుని కష్టపడి చదు వుతేనే ఉన్నత శిఖరాలకు చేరుతారని ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ మేనేజ్మెంట్ డీన్ ప్రొపెసర్ శ్రీరాములు అన్నారు. బర్కత్ పుర అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఆరంభ 2026 పేరుతో ప్రేషర్స్ డే వేడుకలు ఆదివారం నారాయణగూడలోని తాజ్ మహల్ హోటల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీరాములు ముఖ్య అతిథి గా హాజరై. అవంతి కళాశాలల వ్యవస్థా పకుడు, ఛైర్మ న్ ఎం.శ్రీనివాస రావుతో కలిసి జ్యోతి ప్రకాశం చేసి ప్రారంభిం చారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ...ప్రస్తుతం విద్యార్థులకు విద్యా వకశాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. కొత్త ఆలోచనలతో దేశ అభివృ ద్ధికి తోడ్పాలని, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని సాధించడానికి అహర్నిశలు కష్టపడి చదవాలని సూచించారు. అవంతి కళాశాల చైర్మెన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థుల ఆలోచనలు దేశానికి ఉపయోగ పడేలా ఉండాలని కోరారు. ఐటీ రంగంలో కాకుండా వివిధ రంగాల్లో కూడా ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మదర్ థెరిస్సా ను ఆదర్శంగా తీసుకొని విద్యాదులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఆకాంకించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉస్మానియా యూ నివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీ రింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట్ దాస్ మారేడు, ప్రొపెసర్ చేతన్ శ్రీవాస్తవ, అవంతి కళాశా లల అధ్యక్షురాలు ఎం.జ్ఞానేశ్వరి, జనర ల్ సెక్రటరీ డాక్టర్ ఎం.ప్రి యాంక, ఎండీ శ్రవణ కుమార్, ఉపాధ్యక్షుడు నందీశ్, హెర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ అప్పా రావు, డైరెక్టర్ డాక్టర్ వెంకట రావు, సెక్రట రీ సాయిరాంపాల్గొన్నారు.



# సికింద్రాబాద్‌లో సినీ హీరోయిన్ లావణ్య త్రిపాఠి సందడి

### శ్రీ వెంకటరమణ గోల్డ్ అండ్ డైమండ్స్ షాపును ప్రారంభించిన నటి లావణ్య త్రిపాఠి

సికింద్రాబాద్, మార్చి 29 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రముఖ సినీ హీరోయిన్ లావణ్య త్రిపాఠీ సికింద్రాబాద్ లో సందడి చేశారు. సికింద్రాబాద్ ఆర్.పి.రోడ్ లో శ్రీ వెంకట రమణ గోల్డ్ అండ్ డైమండ్స్ 14వ ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను సినీనటి లావణ్య త్రిపాఠి ప్రత్యేక అతిథిగా విచ్చేసి గ్రాండ్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ మనీష్ మాట్లాడుతూ శ్రీ వెంకటరమణ గోల్డ్ అండ్ డైమండ్స్ తమ సంప్రదాయం, వారసత్వం, సాంస్కృతిక విలువలను ప్రతిబింబించే బంగారం వజ్రాభరణాలతో వినియోగదారులకు అత్యుత్తమ సేవలను అందిస్తోందనీ అన్నారు. కొత్తగా ప్రారంభిం చిన ఈ స్టార్ లో డై మండ్స్ రూ.46,999లు,1000 గ్రామ్స్ సిల్వర్ ఆర్టికల్స్ కొంటే 100 గ్రామ్స్ సిల్వర్ ఆర్టికల్స్ ఫ్రీ, బ్రైడల్ ఆఫర్ కింద 200 గ్రామ్స్ కొనుగోలు పై బ్రైడల్ గోల్డ్ జెవెల్లరీ హనీమూన్ ట్రిప్,500 కొనుగోలుపై బ్రైడల్ గోల్డ్ జెవెల్లరీ దుబాయ్ ట్రిప్ ఇంకా లాబ్ గ్రోన్ డైమండ్ కొన్నవారికి టీవీ, ఏసీ, సిల్వర్ జ్యూవలరీ ఐఫోన్, స్కూటీ అందిస్తున్నామని చెప్పారు. ఈ ఆఫర్ మార్చి 29 నుండి ఏప్రిల్ 5 వరికి మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆధునికతతో కూడిన సంప్రదాయ డిజైన్లు, పెళ్లిళ్లు, వధూవరుల వేడుకలు ప్రత్యేక సందర్భాల కోసం విభిన్న కలెక్షన్లు ఈ స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయనీ అన్నారు.

# రేవంత్ రెడ్డి నిర్ణయం సమస్యలు పరిష్కరించే విధంగా ఉంటుందనుకున్నాం

**ధర్నా చౌక్ ఉండి ఏమి లాభం?**

**ఇంకెన్ని రోజులు ధర్నాలు చేయాలి**

**ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి ఖజానా నుండి జీతాలు చెల్లించాలి**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



సికింద్రాబాద్, మార్చ్ 29 (వాయిస్ టుడే ప్రతినిధి): కెసిఆర్ ఇక ముందు ధర్నా చౌక్ ఉండదు అని అన్నారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్నా చౌక్ ఉంటుంది అని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యలు పరిష్కరించే విధంగా ఉంటుందని అనుకున్నాము, కానీ ధర్నా చౌక్ ఉంటుంది, తమకు ఇష్టం ఉన్నన్ని రోజులు ధర్నాలు చేసుకోండి అనే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందనీ, మరి ధర్నా చౌక్ ఉండి కూడా ఏం లాభం.. ఇంకా ఎన్ని రోజులు ఈ ధర్నాలు చేయాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు హైదరాబాద్, ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఆదివారం ఔట్ సోర్సింగ్ జేఏసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో క్రమబద్ధీకరణ పలు డిమాండ్లతో కూడిన మహా ధర్నా నిర్వహించారు. ఈ మహా ధర్నాకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, డీఎస్పీ వ్యవస్థాపకుడు శారదన్ మహారాజ్, పలువురు నాయకులు హాజరై మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నా తనకు కూడా ఎంతో కొంత ఆ పాపంలో భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఉద్దేశించి తమ జీవితాల్లో ఆనాడే మార్పు తేలేకపోయినందుకు మీ చెల్లిగా మీ, సోదరిగా క్షమించాలని కోరుతున్నాను అని ఆమె అన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి ఉద్యోగులకు వేతనాలు నేరుగా ప్రభుత్వ ఖజానా ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ ప్రెసిడెంట్ పి లక్ష్మయ్య మాట్లాడుతూ సమాన వేతనం, ఈపీఎఫ్ ఈఎస్ఐ మెడికల్ సదుపాయాలు చెల్లింపు, సెలవులు వంటి ప్రాథమిక హక్కులు కూడా అమలు చేయకపోవడం దారుణం అని పేర్కొన్నారు ఇది కార్మిక చట్టాల ఉల్లంఘన అని స్పష్టం చేశారు. ఈ మహా ధర్నాలో తెలంగాణ జేఏసీ కమిటీ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బాలకృష్ణారెడ్డి, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.






# Ai యుగంలో కూడా అంటరానితనమా?

**యాద్రాస్పల్లి గ్రామంలో బాధిత కుటుంబాలతో సమావేశం అయిన కనాయకులు**

**సంఘటన జరిగిన వెంటనే స్పందించిన పోలీసు వారికి కృతజ్ఞతలు**

**రాములోరి కల్యాణానికి దళితులను రావద్దన్న వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఆత్మగౌరవ పోరాటం ఆగదు**

నాగారం,మార్చి 29:-(వాయిస్ టుడే) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడు చింతలపల్లి మున్సిపాలిటీ యాద్రాసపల్లి గ్రామంలో ఆదివారం బాధిత దళిత కుటుంబాల ముఖ్య సమావేశంలో కీసరమండల నేతలు పాల్గొని యద్రాస్పల్లిలోని రామాలయంలో సీతా రామ కల్యాణ వేడుకల్లో పాల్గొనేందుకు అదే గ్రామానికి చెందిన పలువురు దళితులు వెళ్లారు. ఆలయంవద్ద యాంజాల నీలమ్మ, యాంజాల యాదమ్మ, చిలుక పుష్పమ్మలు ఆలయానికి చెప్పులు వేసుకొని ఎందుకు వస్తున్నారు, మా పక్క మీరు కూర్చోవద్దు, కొబ్బరికాయలు కొట్టొద్దంటూ దూషించిన వారిపై తక్షణమే స్పందించిన శామీర్పేట్ పోలిస్టేషన్ సీఐ ఎస్ ఐలకు కృతజ్ఞతలు తెలియజేస్తూనే వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోని భవిషత్తులో అంటరానితనం రూపుమాపేలా పౌరహక్కుల సదస్సు నిర్వహించి అవమానం జరిగిన చోటే తలేత్తుకునేలా ఉండేలా తోడ్పాటు అందించాలని కీసర మండల నేతలు కోరడం జరిగింది. దళితులలో ఆత్మనూన్యత భావం తీసివేసి స్వేచ్ఛ ప్రపంచంలో ఉన్నంతంగా బ్రతకాలని అప్పుడే అంటరానితనం రూపుమాపుతుందని పలువురు పెద్దలు సూచించారు. సరిగ్గా 1930లో డా బి ఆర్ అంబేద్కర్ నేతృత్వంలో గుడిలోకి ప్రవేశించిన పోరాటాన్ని గుర్తు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామరం సుజాత, ఎమ్మార్పియస్ కీసరమండల ఇంచార్జ్ బుడిగే జగన్, కీసర మండల ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షులు బక్కని కుమార్, కీసర మండల ఆదిజంభవ అరుంధతి సేవాసమితి సభ్యులు తుడుం శ్రీనివాస్, మాదిగ జాగృతి నాయకులు చొక్కాపురం శ్రీరాములు, చినింగని మల్లేష్, పోచయ్య, చొక్కాపురం ప్రవీణ్, చిర్యాల గ్రామ ఎంఆర్పీఎస్ అధ్యక్షులు బండారి నరసింహ రావు, ఉపాధ్యక్షులు బురిగల్ల మధు పాల్గొన్నారు.



# ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ఇందిరాపార్క్ స్థలాన్ని కాపాడాలి

### కబ్జా చేస్తున్న వ్యక్తి పై చర్యలు తీసుకొని అరెస్ట్ చేయాలి: నెల్లికంటి సత్యం

సికింద్రాబాద్, మార్చ్ 29 (వాయిస్ టుడే ప్రతినిధి): కరాటే క్లాసుల పేరుతో ప్రభుత్వ స్థలమైన ఇందిరా పార్క్ లోని కొంత భాగాన్ని నిర్వాహకుడు మహమ్మద్ షఫీరుద్దీన్ స్థలాన్ని కబ్జా చేస్తున్నాడని, వెంటనే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి, ఆ స్థలాన్ని కబ్జా నుండి విముక్తి పరచాలని, కబ్జాదారునికి మద్దతిస్తున్న నాయకులపై నా చర్యలు తీసుకోవాలని శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సిపిఐ పార్టీ నాయకులు నారాయణ తో కలిసి ఇందిరా పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజల స్థలమైన ఇందిరాపార్క్ లో ఎలాంటి అనుమతులు లేకుండా మహమ్మద్ షఫీరుద్దీన్ కరాటే క్లాస్లులు నిర్వహిస్తున్నారని, అంతేకాకుండా పార్క్ గోడలు కూల్చేసి, నిర్మాణాలు చేపడుతూ పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్నారని చెప్పారు. వెంటనే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ఇందిరా పార్క్ స్థలాన్ని కబ్జాదారుల చెరనుండి విముక్తి కలిగించి, కబ్జాకు ప్రయత్నిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**రానున్న ఎన్నికల్లో లష్కర్‌లో టీడీపీ జెండా ఎగురవేస్తాం**

**సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్**



సికింద్రాబాద్, మార్చి 29 (వాయిస్ టుడే ప్రతినిధి): రానున్న ఎన్నికల్లో లష్కర్ లో టీడీపీ జెండా ఎగురుతుందని సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. లస్కర్ ఒకప్పుడు టిడిపి కి కంచుకోటగా ఉండేదని తిరిగి పూర్వ వైభవం తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి దిశగా ప్రతి కార్యకర్త కంకణ బద్ధలై పనిచేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను టీడీపీ నాయకులు సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలోని అన్ని డివిజన్ లలో పార్టీ జెండా ఎగురవేసి, స్వీట్లు, పళ్లు పంచి పెడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు వల్లారపు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగువారి కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన ఘనత నందమూరి తారకరామారావు కే దక్కుతుందని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల మహిళలు, కార్మికులు, రైతుల అభ్యున్నతికోసం ఏర్పడిన పార్టీ తెలుగు దేశం పార్టీ అని గుర్తు చేశారు. అభివృద్ధికి మారుపేరు తెలుగుదేశం పార్టీ అని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జిఎం.రమేష్, గండికోట విజయ్ కుమార్, చందర్ ముదిరాజ్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య జయంతి ఉత్సవ కమిటీ సభ్యునిగా గొరిగే నరసింహ కురుమ



సికింద్రాబాద్/మేడిపల్లి, మార్చి 29 (వాయిస్ టుడే ప్రతినిది): దొడ్డి కొమరయ్య ఉత్సవ కమిటీ సభ్యునిగా నరసింహ కురుమను నియమిస్తున్నట్లుగా మాజీ ఎమ్మెల్సీ జగ్గయ్య మల్లేష్, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గొరిగే నరసింహ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య. అలాంటి కెమెరా జయంతి ఉత్సవ కమిటీ సభ్యునిగా నన్ను నియమించినందుకు ప్రతి ఒక్క కురుమ సంఘం నాయకులకు ధన్యవాదాలు. నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ దొడ్డి కమరయ్య త్యాగాలను పూర్తిగా తీసుకొని వారి త్యాగాలను ప్రజల్లోనికి తీసుకువెళ్లే బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

# ఏప్రిల్ 5న భారీ కవి సమ్మేళనం

**కుల వివక్షపై గళమెత్తాలని కవులు, కళాకారులకు పిలుపు**

**ఎస్ వి కే కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్**

సికింద్రాబాద్, మార్చి 29 (వాయిస్ టుడే ప్రతినిధి): సామాజిక సమానత్వాన్ని సాధించడమే లక్ష్యంగా ఏప్రిల్ 5న హైదరాబాద్, బాగ్ లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వేదికగా భారీ 'కవి సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రాన్ని కవి సమ్మేళనం నిర్వాహకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్ మాట్లాడుతూ ఈ దేశంలో మనిషి హక్కులు ఆయన పుట్టుక ఆధారంగానే నిర్ణయించబడటం దురదృష్టకరం, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి పౌర హక్కులు కుల వ్యవస్థ వల్ల సామాన్యుడికి నిరాకరించబడుతున్నాయి అన్నారు. అదేవిధంగా మనిషి ఎదుగుదలకు కులం అతిపెద్ద ఆటంకంగా మారిందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న కుల వివక్షను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకే కుల నిర్మూలన సాంస్కృతికోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కవి సమ్మేళనంలో కవులు, రచయితలు అధిక సంఖ్యలో పాల్గొని తమ గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితి కార్యదర్శి కె. ఆనందాచారి, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు కుల బాలోత సవంఉపాధ్యక్షురాలు సుజావతి, తెలంగాణ సాహితి సహాయ కార్యదర్శి అనంతోజు మెహన్ కృష్ణ తెలంగాణ సాహితి మహేష్ దుర్గే తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్‌లో ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు





**హాజరైన కలెక్టర్,ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ ఎండి**

**దేశ,విదేశాల నుండి హాజరైన పూర్వవిద్యార్థులు**

**గత స్మృతులను తలుచుకుంటూ భావోద్వేగాలు**

**ఇంతటి గొప్పకార్యక్రమం నిర్వహించిన ఇ.వి కి కృతజ్ఞతలు..**

హనుమకొండ,వాయిస్ టుడే: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ చాహత్ బాజ్ పాయి,ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో కూడా ఈ కళాశాలకు చెందిన ఇంజినీర్లు ఉన్నారని తెలిపారు. బీటెక్ చదివిన వారికంటే పాలిటెక్నిక్ చదివిన వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎక్కువగా ఉండి త్వరగా ఉపాధి అవకాశాలు లభించి స్థిరపడతారని చెప్పారు. రూ.28 కోట్లతో నూతన భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల నూతన భవన ప్రారంభోత్సవానికి మళ్లీ పూర్వ విద్యార్థులందరూ రావాలని ఆకాంక్షించారు. తన కుటుంబానికి కూడా పాలిటెక్నిక్ విద్యతో అనుబంధం ఉందని,తన తండ్రి పాలిటెక్నిక్ చదివి ఉన్నత ఉద్యోగం సాధించారని,ఆ ప్రేరణతోనే తాను కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

NPDCL సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యకు గొప్ప ప్రాధాన్యం ఉందన్నారు. డిప్లమా,ఇంజినీరింగ్ మధ్య తేడా లేదని..నైపుణ్యమే విజయానికి మూలమని పేర్కొన్నారు. AI మనుషులను భర్తీ చేయదని,కొత్త సాంకేతికతలను నేర్చుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

### అనంతరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ప్రత్యేకత

పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఇ.వి. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఈ కళాశాలలో చదవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దేశ విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ సమ్మేళనం ప్రత్యేకంగా నిలిచిందన్నారు. కళాశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. నూతన భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

### చరిత్ర -- అభివృద్ధి పథం..

ఉన్నత హోదాల్లో పాలిటెక్నిక్ విద్యార్థులు చిన్న స్థాయిలో ప్రారంభమైన ఈ విద్యాసంస్థ నేడు సాంకేతిక విద్యలో విశిష్ట గుర్తింపు పొందింది. వేలాది మంది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచింది. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశవ్యాప్తంగా ప్రముఖ సంస్థల్లో ఉన్నత స్థానాలను అధిరోహించారు. ఐఏఎస్, ఐపీఎస్,ఐఎఫ్ఎస్ అధికారులు,శాస్త్రవేత్తలు, వ్యాపారవేత్తలు,రాజకీయ నాయకులుగా ఎదిగి కళాశాలకు కీర్తి తెచ్చారు. బీహెచ్ఈఎల్, ఎచ్ఏఎల్, జెన్‌కో, ఎన్పీడీసీఎల్, హెచ్సీఎల్, డీఆర్‌డీవో, ఇస్రో, ఐడీపీఎల్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తు న్నారు. ఈ కళాశాల ప్రారంభదశలో అజంజాహి మిల్లు ప్రాంగణంలోని ఒక షెడ్డులో 120 మంది విద్యార్థులతో సివిల్,మెకానికల్,ఎలక్ట్రికల్ కోర్సులతో ప్రారంభమైంది. 1955 జూలై 10న 16 ఎకరాల విస్తీర్ణంలో నూతన క్యాంపస్‌కు శంకుస్థాపన జరిగింది. ప్రస్తుతం కళాశాలలో 1620 మంది విద్యార్థులు చదువుకుంటుండగా 150 మంది అధ్యాపకులు,సిబ్బంది సేవలందిస్తున్నారు. 1995-96లో ఈసీఈ, కంప్యూటర్ కోర్సులు ప్రారంభమై తరువాత సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు కూడా ప్రవేశపెట్టబడ్డాయి.

### జ్ఞాపకాల సందడి...

20 నుంచి 80 సంవత్సరాల వయస్సు గల పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి అల్లర్లు,గురువులతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఎన్నేళ్ల తర్వాత స్నేహితులను కలవడం మరపురాని అనుభూతిగా భావించి ఆనందం వ్యక్తం చేశారు. తరగతి గదుల్లో మళ్లీ కూర్చొని ఉత్సాహంగా గడిపారు. తమ కాలేజ్‌ను "అమ్మ"గా భావిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమం కన్నులపండువగా సాగింది. ఇంతటి గొప్పకార్యక్రమం నిర్వహణకు బీజం వేసి,అందరిని ఒక్కతాటిపై నడిపించిన ఇ.వి శ్రీనివాస్ కు ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమ విజయానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్,సంగీత కళాశాల బృందం,పూర్వ విద్యార్థులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



## గురుకుల విద్యాలయాలకు 11మంది విద్యార్థుల ఎంపిక

**విద్యార్థులను అభినందించిన సంఘమిత్ర పరపతి సంఘం ప్రతినిధులు**

తొర్రూరు , మార్చి 29 వాయిస్ టుడే : తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాల నుండి ఇటీవలికాలంలో తెలంగాణా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ వారు నిర్వహించిన ప్రవేశ పరీక్ష,బి2026 ఫలితాలలో పాఠశాల నుండి పదకొండు మంది మంది విద్యార్థులు (టియస్ డబ్ల్యూఆర్ఈఐయస్) ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించారు.ఇదే పాఠశాల నుండి ఈ పరీక్షకు 15 మంది హాజరయ్యారు. ఈ ప్రవేశపరీక్ష అభ్యాసము కొరకు,అంబేద్కర్ కాలనీకి చెందిన సంఘమిత్ర పొదుపు పరపతి సంఘం వారు ప్రవేశ పరీక్షాదర్శిని పుస్తకాలను వితరణ చేశారు.ఈ సందర్భంగా ప్రవేశార్హత పొందిన ఆ విద్యార్థులను ఉపాధ్యాయులతో పాటుగా, సంఘమిత్ర ప్రతినిధి బృందం సభ్యులు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. ఎంపికైన వారిలో బి.శ్రేయశ్రీ, జి.అక్షన, జి.అమృతవర్షిణి, ఈ.రిషిత,డి.రాజేశ్వరి,ఎస్ రితిక, ఎం.చిత్రవర్ష, బి.మహేష్,పి. సాగర్, కే.సృజన్, పి.రిషివర్ధన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వాతి,ఉపాధ్యాయులు సరిత, సునిత, సంధ్యారాణి, ప్రవీణ్ కుమార్, శిరీష, యమున, సతీష్ తదితరులతో పాటుగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్క్ స్థలం కబ్జాపై అసెంబ్లీలో గర్జించిన ఎమ్మెల్యే నాయిని

**దొంగే దొంగ అనడం సిగ్గుచేటు.. ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు**

**200 కోట్ల దోపిడీపై CBI,CID దర్యాప్తుకు డిమాండ్...**

**తప్పైతే రాజీనామా చేస్తానని సవాల్**



హనుమకొండ,వాయిస్ టుడే: పార్క్ స్థలం కబ్జాచేసి హనుమకొండలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఆరోపిస్తూ ఆదివారం అసెంబ్లీలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ పాలనలో వేల కోట్ల అవినీతి చేసిన వారు ఇప్పుడు దొంగలే దొంగ అని ఆరోపించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. హనుమకొండ నడిబొడ్డున బీఆర్ఎస్ నాయకులు సుమారు 200 కోట్ల అక్రమ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించిన ఆయన ఈ వ్యవహారంపై వెంటనే జదీ×,జ×ణ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ అవసరమని స్పష్టం చేశారు. తాను చేసిన ఆరోపణలు తప్పని నిరూపితమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. అదే విధంగా కేటీఆర్,హరీష్ రావు కూడా రాజీనామాకు సిద్ధమా అని ప్రశ్నిస్తూ సవాల్ విసిరారు.హనుమకొండలో పార్క్ భూమిని ఆక్రమించి పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకున్నారనే ఆరోపణలను ప్రస్తావిస్తూ,దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తన రాజీనామా లేఖను నేరుగా శాసనసభ స్పీకర్ కు పంపిస్తున్నానని తెలిపారు. ప్రతిపక్షాలకు ధైర్యం ఉంటే తమపై వచ్చిన ఆరోపణలు తప్పని నిరూపించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సవాల్ విసిరారు.

## వయోజన నిరక్షరాస్య మహిళలకు అమ్మకు అక్షరమాల పరీక్షలు

**డీఆర్డీఓ, మెప్మా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహణ**

**హాజరైన 12 వేలకు పైగా మంది మహిళలు**



రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి 29 (వాయిస్ టుడే); రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా లోని వయోజన నిరక్షరాస్య మహిళలకు అమ్మకు అక్షరమాల కార్యక్రమం కింద పరీక్షలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలకు అనుగుణంగా డీఆర్డీఓ, మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలోని 23,375 మంది వయోజన నిరక్షరాస్య మహిళలకు జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామపంచాయతిల్లో అమ్మకు అక్షరమాల కార్యక్రమం కింద మూడు నెలల పాటు పుస్తకాలు అందజేసి, పాఠాలు బోధించారు. బోధన పూర్తి కాగా, జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఆదివారం వయోజన నిరక్షరాస్య మహిళలకు ఐకేపీ అధికారులు, సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. మొత్తం 12,856 మంది పరీక్షలు రాశారు. వయోజన మహిళలు బోధన సద్వినియోగం చేసుకొని.. పరీక్షలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో ఐకేపీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

సిరిసిల్ల, మార్చి 29 (వాయిస్ టుడే); కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యం లో పలువురు యువకులు పార్టీ లో చేరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమా నికి ముఖ్యఅతిథి గా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ హాజరయ్యారు.ఈ సందర్భం గా కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్న యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ గారు మాట్లాడుతూ,నూతనం గా కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్న యువకులకు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం, ప్రజల సంక్షేమం కోరుతూ అమలు చేస్తున్న పథకాల గురించి క్షేత్రస్థాయిలో అందరికీ తెలిసే విధంగా ప్రచారం చేయాలి.నూతనం గా పార్టీ లో చేరిన కార్యకర్తలు ఏఐసిసి, పిసిసి, డిసిసి, పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యం లో ఇచ్చిన ఏ పిలుపు నైనా స్వీకరించి కార్యక్రమాల్లో పాల్గొనాలి అని అన్నారు.కార్యక్రమం లో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, స్థానిక నాయకులు బడుగు బారత్, నాగరాజు, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## మూసాపేట్‌లో ఘనంగా 'ఈదమ్మ శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు

**కాంగ్రెస్ నేత బండి రమేష్ హాజరు**

**రజకుల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని హామీ**

కూకట్‌పల్లి; మార్చి 29(వాయిస్ టుడే): కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట్ ప్రాంతంలో రజక సంఘం ఆహ్వానం మేరకు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈదమ్మ మరియు శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా బండి రమేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. రజక సంఘం వంటి బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రజకుల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు, ఉపాధి అవకాశాలు, సబ్సిడీలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. సమాజంలో ప్రతి వర్గానికి సమాన న్యాయం జరిగేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. దోబీ ఘాట్ వద్ద ఉన్న సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏ బ్లాక్ అధ్యక్షులు పటోళ్ల నాగిరెడ్డి, తూము ఎల్లారావు, రాజు, తూము సంతోష్ కుమార్, సప్పిడి భాస్కర్, అమీర్, బుచ్చిబాబు, రజక సంఘ నాయకులు నోముల యాదగిరి, నోముల స్వామి, నరేష్, సత్యనారాయణ, తోట మల్లేష్ తదితరులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భక్తుల సందడి, జయజయధ్వానాలతో మూసాపేట్ వీధులు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.



## అమ్మాపురంలో ఘనంగా పారువేట ఉత్సవాలు

తొర్రూరు, మార్చి 29 వాయిస్ టుడే : తొర్రూరు మండలంలోని అమ్మాపురం గ్రామంలో ఆదివారం పారువేట ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ రంగులతో అందంగా అలంకరించిన ఎడ్ల బండ్లకు స్థానిక సర్పంచ్ ముద్ధం సునీత వీరారెడ్డి, ఉప సర్పంచ్ సిరిపాటి విశాల్, శాట్ అధ్యక్షుడు తీగల కృష్ణారెడ్డిల చేతుల మీదుగా మొదటి బహుమతి బూరుగు వీరేష్ గౌడ్, రెండవ బహుమతి వడ్లకొండ అశోక్ గౌడ్, మూడవ బహుమతి బూరుగు కుమార్ గౌడ్ లు అందుకున్నారు. అదే విధంగా మిగతా ఎడ్ల బండ్లకు సైతం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.



## గంగపుత్రులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

**గ్రామాల్లోని చెరువులు కుంటలపై గంగపుత్రులకు హక్కు కల్పించాలి**


తొర్రూరు, మార్చి 29 వాయిస్ టుడే : తొర్రూరు పట్టణ కేంద్రంలోని స్థానిక తిరుమల గార్డెన్ లో ఏర్పాటుచేసిన గంగపుత్ర ఏక సంఘం నిర్మాణ సమావేశానికి పెద్దపల్లి సాంబయ్య అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర కార్యదర్శిలు అంబటి వెంకన్న ,గోధుమల సంపత్ లు పాల్గొని వారు సంయుక్తంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం గంగపుత్రులను ఎస్సీ రిజర్వేషన్ జాబితాలో చేర్పిస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేనియెడల గంగపుత్రులందరినీ ఐక్యం చేసి రిజర్వేషన్ సాధించేవరకు దశలవారీగా ఉద్యమాలను చేస్తామని పేర్కొంటూ గత ప్రభుత్వాలు గంగపుత్రులను కేవలం ఓటు బ్యాంకుగా చూశాయని ఆరోపిస్తూ గ్రామాలలో ఉన్నటువంటి చెరువులు కుంటలు కాలువలు గంగపుత్రులకే చెందుతాయని గత ప్రభుత్వాలు హామీలు ఇస్తూ పోయారు, తప్ప గంగపుత్రులకు వర్గబెట్టింది ఏమీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గంగపుత్రులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాలు మారిన గంగపుత్రుల బ్రతుకులు ఏమాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ ప్రజల ప్రభుత్వంలోనైనా గంగపుత్రుల బతుకులు మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు,గంగపుత్రుల . ఈ కార్యక్రమంలో గంగపుత్ర ఏక సంఘ నిర్మాణ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
సోమవారం 30 మార్చి 2026



## చెరువులో మునిగి ఇద్దరు గొర్రెల కాపరుల మృతి

కోనరావుపేట, మార్చి 29(వాయిస్ టుడే): మండలంలోని ధర్మారం గ్రామంలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గొర్రెలను కాసేందుకు వెళ్లిన ఇద్దరు కాపరులు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం,గ్రామానికి చెందిన మూడికె లక్ష్మీరాజం (58), కుమ్మరి మొండయ్య (50) తమ గొర్రెల మందలను మేపేందుకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో గొర్రెలకు నీరు తాగించేందుకు స్థానిక చెరువులోకి తీసుకెళ్లారు. ఈ క్రమంలో గొర్రెలు చెరువు లోపలికి వెళ్లడంతో, వాటిని బయటకు తీసుకువచ్చే ప్రయత్నంలో ఇద్దరూ ప్రమాదవశాత్తు లోతైన నీటిలోకి వెళ్లిపోయారు. నీటిలో మునిగిపోతున్న వారిని గమనించే లోపే ఇద్దరూ జలసమాధి అయ్యారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



## గ్రానైట్ క్వారీల నిర్వాహకం

**పురాతన రంగనాయక గుడికి బీటలు**

**ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు**

**జిల్లా మైనింగ్ అధికారులు మౌనం**

కరీంనగర్ రూరల్ మార్చి 29(వాయిస్ టుడే): కొత్తపల్లి మండల పరిధిలో పరిసర గ్రామ పరిధిలో గ్రానైట్ క్వారీల తవ్వకాల వల్ల పురాతన ఆలయాలు బీటలు వారుతున్నాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.కరీంనగర్ జిల్లా మైనింగ్ అధికారులు మైనింగ్ అనుమతులు ఇచేటప్పుడు కనీసం గ్రామస్థుల అభిప్రాయాలు తీసుకోలేదని,ఇప్పుడు ఆలయానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని సంబంధిత శాఖ ఏడి,మరియు అధికారుల దృష్టికి తీసుకెళితే అధికారులు దాటవేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని గ్రామస్థులు మండిపడ్డారు.మండల పరిధిలో తవ్వకాలు జరుపుతున్న కొన్ని క్వారీల నిర్వహణకు కనీసం అనుమతులు కూడా లేవని కానీ సంబంధిత అధికారుల నిర్లక్షం, ఉదాసీనత వల్ల ఖరీదైన ఖనిజాలు చడీ చప్పుడు కాకుండా తవ్వకాలు జరిపి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నా ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్నా అధికారుల్లో చలనం రావడం లేదని వాపోతున్నారు.అసెంబ్లీ సాక్షిగా స్వయాన ముఖ్యమంత్రే గ్రానైట్ తవ్వకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని చెప్పినా కూడా జిల్లా అధికారుల్లో చలనం రావడం లేదంటే అధికారుల నిర్లక్షం ఏపాటిదో అర్థం అవుతుందని,ఇప్పటికైన చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళనలు చేపడతామని గ్రామస్థులు హెచ్చరిస్తునారు.




## కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం

**యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీకి పట్టుకొమ్మలు**

**ఇంచార్జ్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్**

కరీంనగర్,మార్చి 29(వాయిస్ టుడే): జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ జిల్లా రివ్యూ సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,జిల్లా ఇంచార్జ్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్ హాజరై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు.ఆయన మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి మరియు బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా,కాంగ్రెస్ పార్టీని మండల మరియు గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని,యూత్ కాంగ్రెస్ కార్యక్రమాలను ప్రతినెల ఐవైసి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చి టికెట్లు కేటాయిస్తామని తెలిపారు.అందువల్ల పార్టీ కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో చురుకుగా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు కృపా సాగర్, మానకొండూరు అధ్యక్షుడు, అట్ల అనిల్, చొప్పదండి, హుజురాబాద్ నియోజకవర్గాల యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ విస్తృత సాయి సమావేశం

**మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసింది**

**రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన..ప్రజాస్వామ్యం కూని**

**గ్రేటర్ పై గులాబీ జెండా ఎగరడం ఖాయం..**

**వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్**



హనుమకొండ,వాయిస్ టుడే: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసిందని,అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ పనీ చేయలేదని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే రమేష్ విమర్శించారు. హన్మకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్ పరిధిలోని పెగడపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ విస్తృత సాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పాల్గొని 1వ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల గురించి మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేయకపోవడం,యాసంగి పంటకు నీళ్లు ఇవ్వకపోవడం వంటి సమస్యలను ప్రస్తావించారు. రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన జరుగుతుందని,ప్రజాస్వామ్యం కూని అవుతుందని అన్నారు.

రేవంత్ రెడ్డి రైతులకు రుణమాఫీ ఎగ్గొట్టాడని,పెగడపెల్లి గ్రామంలో రైతులకు రుణమాఫీ జరగక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారికి రుణమాఫీ జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. యాసంగి పంటకు కావలసినన్ని ఎస్సారెస్పీ నీళ్ళు వచ్చేలా అధికారుల పై ఒత్తిడి తెస్తామని తెలిపారు. అన్ని కుల సంఘాలు,మహిళా సంఘాల నిర్మాణానికి నిధులు తీసుకువస్తే వాటిని పూర్తి చేయడం లేదని విమర్శించారు. అసెంబ్లీలో కేటీఆర్,హరీష్ రావు అసెంబ్లీలో ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల పై పోలీసులతో అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని విమర్శించారు. కేసులకు భయపడేది లేదని,ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపాల్టీ పై గులాబీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ రవి నాయక్,డివిజన్ అధ్యక్షులు నారెడ్ల శ్రీధర్,ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



## సిద్ధాంతమే బీజేపీ స్ట్రెంత్

**క్యాడర్ బేస్డ్ పార్టీ బిజెపి: నగర మేయర్ కొలగని శ్రీనివాస్**

కరీంనగర్,మార్చి 29(వాయిస్ టుడే): భారతీయ జనతా పార్టీ ఎంచుకున్న సిద్ధాంతం,భావాజాలంతోనే పార్టీ ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా అవతరించిందని, క్యాడర్ బేస్డ్ పార్టీ బిజెపి అని నగర మేయర్ కొలగని శ్రీనివాస్ అన్నారు. పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ శిక్షణలో భాగంగా కరీంనగర్ మండలం,నార్త్ జోన్ శిక్షణ శిబిర ముగింపు (సమారోప్) కార్యక్రమంలో మేయర్ కోలగని శ్రీనివాస్ పాల్గొనిపై వ్యాఖ్యలు చేశారు.సమరోప్ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నేతలు సంగ నరేష్,అయ్యశీగారి ప్రభాకర్రెడ్డి,రాణి రుద్రమ,ఈనుకొండ నాగేశ్వర్ రెడ్డిలు మాట్లాడుతూ ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన భారతీయ జనతా పార్టీ నేడు దేశాన్ని ఏలుతుందని,వరుసగా 3 సార్లు కేంద్రంలో అధికారంలో వచ్చిందని, దేశంలోనే తిరుగులేని శక్తిగా అవతరించిందన్నారు.బీజేపీ పార్టీ సిద్ధాంతం ఎంతో గొప్పదన్నారు.నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్ సెల్ఫ్ లాస్ట్ సిద్ధాంతం.దేశం కోసం మన పార్టీ ఆలోచించే విధానంతోనే నేడు దేశంలోనే తిరుగులేని శక్తిగా అవతరించిందన్నారు.అందుకే వరుసగా మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు.మోడీ ప్రభుత్వం,బిజెపి పట్ల ప్రజలంతా ఎంతో విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకు వెళ్లడానికి కృషి చేయాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యలపై నిరంతరం పోరాటం చేయాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధనకార్యదర్శిలు తల్లాపల్లి శ్రీనివాస్ గౌడ్,మాడ వెంకట్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ కటుకం లోకేష్,మండల అధ్యక్షులు సంతోష్, పదం శివరాజ్,కార్పొరేటర్ లు సోమిడి వేణుప్రసాద్ బండారి వేణు, సాదినేని లావణ్యమునిశేధర్, సాయిల్ల శ్రావణి,మహేందర్ పాల్గొన్నారు.



## మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై సమీక్ష

కరీంనగర్,మార్చి29(వాయిస్ టుడే): హైదరాబాద్ అసెంబ్లీ కమిటీ హాల్‌లో మానేరు రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మలనాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్,జూపల్లి కృష్ణారావు,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రులు మానేరు రివర్ ఫ్రంట్ పనుల పురోగతి,పెండింగ్ నిధులు మరియు ప్రాజెక్టు పూర్తికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్,అధికారులు, ఎమ్మెల్యేలతో చర్చించారు. ప్రాజెక్టును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులతో క్షేత్రస్థాయి నివేదికలపై ఆరా తీశారు. త్వరలో మానేరు రివర్స్ ఫ్రంట్ పై క్షేత్ర స్థాయిలో పర్యటన చేస్తామన్నారు. భూ సేకరణ,అంచనా వ్యయం,నీటిపారుదల, పర్యాటక శాఖకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు మరియు జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా,మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్,ఇరిగేషన్, టూరిజం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భగత్ నగర్ హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయంలో ఘనంగా చిన్నారుల 'గజ్జె పూజ' కార్యక్రమం

**ముఖ్య అతిథులుగా నగర మేయర్, డిప్యూటీ మేయర్**




కరీంనగర్,మార్చి 29(వాయిస్ టుడే): నగరంలోని భగత్ నగర్ హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయంలో చిన్నారుల 'గజ్జె పూజ' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు ఆధ్వర్యంలో, ప్రముఖ నృత్య కళాకారిణి సమక్షంలో ఈ వేడుకను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నగర మేయర్ కోలగాని శ్రీనివాస్,డిప్యూటీ మేయర్ మరియు రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు చిన్నారుల నృత్య ప్రదర్శనలను తిలకించి, వారిని సాదరంగా అభినందించారు. భారతీయ సంస్కృతిని,కళలను చిన్నతనం నుంచే అభ్యసించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఓకే రోజు 5 లక్షల విలువ గల 2 ఎల్ఓసి మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి 29 (వాయిస్ టుడే) వేములవాడ నియోజకవర్గం కొనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన అనుముల బాలవ్వ తీవ్ర అనారోగ్యంతో అత్యవసర చికిత్స అవసరమైన విషయం తెలుసుకున్న వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించారు.నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ప్రత్యేక చికిత్స అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం నుండి 2 లక్షల 50 వేల రూపాయలు, మండేపల్లి గ్రామానికి చెందిన బేబీ కి 2 లక్షల 50 విలువ గల ాూజ ను ఒకే రోజులో 5 లక్షలు వైద్య ఖర్చుల కోసం వెంటనే మంజూరు చేయించారు.ఈ సహాయం అందించడం తో బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## వందేమాతరం పుస్తక రచనలో పాలుపంచుకున్న మంజుల పత్తిపాటి






భవానీ సాహిత్య అకాడమీ, కరీంనగర్ ఆధ్వర్యంలో,వైరాగ్యం ప్రబాకర్ సంపాదకత్వంలో వెలువడిన "వందేమాతరం" పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో భాగ స్వామ్యమై, "వందేమాతరం" పై కవిత రచించి పంపి,ఆ పుస్తక ప్రచురణలో భాగస్వామ్యమైన తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ మహిళా నాయకురాలు, సామాజిక కార్యకర్త, కవయిత్రి మరియు మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజుల పత్తిపాటి వారి సాహిత్య సేవలను అభినందిస్తూ ప్రశంసా పత్రంతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆమె పత్రికల ద్వారా తన ధన్యవాదాలు తెలిపారు.

## మక్తల్ సర్పంచుల సంఘం అధ్యక్షురాలుగా గవినోళ్ల సుమిత్రమ్మ



మక్తల్ మార్చ్ 29 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ మండల సర్పంచుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్పంచుల సర్వసభ్య సమావేశంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షురాలిగా గవినోళ్ళ సుమిత్రమ్మ (సంగంబండ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా రవితేజ (ఉప్పరపల్లి), ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు గౌడ్ (పంచలింగాల), కార్యదర్శిగా డి. అశోక్ (నర్సిరెడ్డిపల్లి), కోశాధికారిగా హెచ్. మహేష్ (కొండదొడ్డి) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలిగా ఎన్నికైన గవినోళ్ళ సుమిత్రమ్మను పలువురు సర్పంచులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించినందుకు మండల సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపిన సుమిత్రమ్మ, సర్పంచుల సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రుల సహకారంతో గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

# జీనెక్స్ సీడ్స్ కంపెనీ సోల్జర్ 888తో అధిక దిగుబడులు

**తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు**

**లంబాడిపల్లె క్షేత్ర ప్రదర్శనలో కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ రాజశేఖర్ వెల్లడి..**

**వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున హాజరైన రైతన్నలు**



చిగురుమామిడి (వాయిస్ టుడే): జినెక్స్ సీడ్స్ కంపెనీ సోల్జర్ 888 మొక్కజొన్న విత్తనాలతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆ కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ రాజశేఖర్ తెలిపారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లె గ్రామ శివారులో బరిగెల స్వప్న రవీందర్ అనే రైతు వేసిన మొక్కజొన్న పంట క్షేత్ర ప్రదర్శనను ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించారు.ఈ సందర్భంగా కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ జినెక్స్ సీడ్స్ కంపెనీ సోల్జర్888 మొక్కజొన్న అన్ని రకాల రోగాలను తట్టుకునే గుణం కలదని,రోగ నిరోధక శక్తి ఎక్కువ ఉంటుందన్నారు.పొడవు అయినా గుండ్రటి కంకితో అధిక వరుసలు కలిగి ఉంటుందని, విత్తనాలు అధిక బరువు ఉంటాయని రైతులకు వివరించారు. గాలి వానలకు సైతం పడిపోకుండా తట్టుకోని నిలబడగలిగే శక్తి ఈ కంపెనీ సీడ్ కు ఉందని తెలిపారు.ఖరీఫ్,రబీ రెండు సీజన్ లో ఈ మొక్కజొన్నను రైతులు వేసుకొని అధిక లాభాలు పొందాలని,కేవలం 120రోజులకు పంట చేతికి వస్తుందనిరైతులకు వివరించారు.అనంతరం రైతు స్వప్నను శాలువా కప్పి ఘనంగా సన్మానించి,కూల్ వాటర్ క్యాన్ ను అందజేసి అభినందించారు.జినెక్స్ సీడ్స్ డిస్ట్రిబ్యూటర్ చిగురుమామిడి శ్రీలక్ష్మి ఫర్టిలైజర్ అవునూరి సతీష్ మాట్లాడుతూ మొక్కజొన్న సాగులో అధిక దిగుబడుల కోసం జినెక్స్ సీడ్స్ కంపెనీ సోల్జర్ 888 ను రైతులు ఎంపిక చేసుకోవాలని,ఎకరాకు 38నుండి 42క్వింటాళ్ల దిగుబడి వస్తుందని సతీష్ తెలిపారు.ఈ మొక్కజొన్న పంట క్షేత్ర ప్రదర్శన కార్యక్రమానికి లంబడిపల్లె,పీచుపల్లె సీతారాంపూర్,చిగురుమామిడి తదితర గ్రామాల నుండి పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో కంపెనీ అధికార ప్రధానిధి ఏరియా సేల్స్ మేనేజర్ రాజశేఖర్,ఫీల్డ్ స్టాఫ్ శివ కుమార్,జినెక్స్ సీడ్స్ డిస్ట్రిబ్యూటర్ చిగురుమామిడి శ్రీలక్ష్మి ఫర్టిలైజర్ అవునూరి సతీష్,రైతులు తేలు వెంకన్న యాదవ్,యాళ్ల జనార్ధన్ రెడ్డి,చందబోయిన రాజు,ఐరెడ్డి భగవాన్ రెడ్డి,కయ్యం వీరన్న,రైతులు పాల్గొన్నారు.

## మాఫియా ముఠాలపై ఉక్కుపాదం మోపాలి: లింగాల

**పాము సిల్వరాజును పరామర్శించిన లింగాల**

**పోలీసుల స్పందన అభినందనీయం.. దోషులను కఠినంగా శిక్షించాలి**



ముదిగొండ మండలం మార్చి 29 వాయిస్ టుడే : కిడ్నాపులు, హత్యాయత్నాలకు పాల్పడే మాఫియా ముఠాల పట్ల కఠినంగా వ్యవహరించాలని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ అన్నారు. ఇటీవల కిడ్నాప్ కు గురైన పండ్రేగుపల్లి సర్పంచ్ భర్త బీఆర్ఎస్ నాయకుడు పాము సిల్వరాజు ను ఆదివారం ఆయన పరామర్శించారు. మండల పరిధిలో పండ్రేగుపల్లి గ్రామంలోని సిల్వరాజ్ నివాసానికి వెళ్లారు. జరిగిన సంఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిల్వరాజు, కుటుంబ సభ్యుల యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సిల్వరాజును కిడ్నాప్ చేయటం హేయమైన చర్య అన్నారు ఇలాంటి పనులు పిరికి పందల చర్య అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారు సాధ్యమైనంత వరకు న్యాయం చేస్తారని తమకు న్యాయం జరగలేదని వారి పట్ల కక్షపూరితంగా వ్యవహరించటం సరికాదని అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే ముఠాల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలని వారి వెనుక ఉన్న వారిని కూడా కఠినంగా శిక్షించాలని అన్నారు. సిల్వ రాజు కిడ్నాప్ ఘటనలో ముదిగొండ సీఐ మురళీ స్పందన మరియు వారి బృందం పనితీరు హర్షనీయం అన్నారు. వెంటనే సంఘటనా స్థలానికి తన బృందాలను పంపడంతో పాటు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ సంఘటనకు సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిని అరెస్టు చేసి శిక్షపడేలా చేయాలని అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని వారికి ఎలాంటి ఆపద వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, పచ్చ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల ఆరోగ్యమే మా లక్ష్యం

**ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**దుద్దెనపల్లి గ్రామ సర్పంచ్ ఉడిగే విజయ రాజశేఖర్**

సైదాపూర్ (వాయిస్ టుడే ):గ్రామ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని,ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దుద్దెనపల్లి గ్రామ సర్పంచ్ ఉడిగే విజయ రాజశేఖర్ తెలిపారు.ఆదివారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లి గ్రామ సర్పంచ్ ఉడిగే విజయ రాజశేఖర్ ఆధ్వర్యంలో కరీంనగర్ కియా హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజేంద్రప్రసాద్,డాక్టర్ కీర్తన పలువురు వైద్యులు హాజరై షుగర్, ఉరిక్ ఆసిడ్ బిపి,ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ వైద్య శిబిరానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభించిందని,దాదాపు 2వందలకుపైగా ప్రజలు తరలివచ్చి పలు రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.తమ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేసిన కియో హాస్పిటల్ వారికి వారు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉడిగే విజయ రాజశేఖర్,వార్డ్ మెంబర్లు పైడిపల్లి సమ్మయ్య,వేముల రాజు,మాజీ జడ్పీటిసి సభ్యులు గుండారపు శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటేశం,మాజీఎంపిటిసి మట్టెల రవి,తాటిపల్లి జితేందర్ రెడ్డి,దొమ్మటి వీరన్న, హాస్పటల్ ఉద్యోగులు రాజు,లక్ష్మణ్, శ్రీకాంత్,నరేష్, ప్రియాంక, రమ, జాకు,రేఖ,అశోక్,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా ఉప్పలమ్మ అమ్మవారి పూజలు

నాగార్జునసాగర్,మార్చి 29 (వాయిస్ టుడే) : నాగార్జునసాగర్ పట్టణంలో స్థానిక పోలీసు వారు ప్రత్యేకంగా నిర్వహించిన ఉప్పలమ్మ అమ్మవారి వారోత్సవాలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరితంగా నిర్వహించారు. పైలాన్ కాలనీ పాత పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆలయం వద్ద నిర్వహించిన వేడుకలలో నాగార్జునసాగర్ సర్కిల్ సీ.ఐ శ్రీను నాయక్,ఎస్.ఐ ముత్తయ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శాంతిభద్రతలు సజావుగా సాగాలని కోరుకుంటూ పూజలు నిర్వహించినట్లు తెలిపారు . భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఏ.ఎస్.ఐ గురునాథం,పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## మహిళల విద్యతో సమాజ అభివృద్ధికి బాటలు

**మంచరామిలో ఉల్లాస్ పరీక్షలు : సర్పంచ్ ఉప్పు లక్ష్మి తిరుపతి**

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా మార్చి–29 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మండలం మంచరామి గ్రామంలో సర్పంచ్ ఉప్పు లక్ష్మి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం లో భాగంగా మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ మహిళలు ఉత్సాహంగా హాజరై పరీక్షలు రాయడం విశేషం. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని భావిస్తూ, మహిళలందరూ విద్యావంతులు కావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని, నిరక్షరాస్య మహిళలకు చదువు నేర్పి, వారికి అక్షరాస్యతను అందించడం ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు తెలిపారు.చదువుకు వయస్సుతో సంబంధం లేదని నిరూపిస్తూ, గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పరీక్షలకు హాజరై ఆదర్శంగా నిలిచారు.పరీక్షలకు హాజరైన మహిళలను అభినందిస్తూ, వారు విద్యా దిశగా ముందుకు సాగాలని సర్పంచ్ ఉప్పు లక్ష్మి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కేంద్ర ప్రభుత్వానికి వివోఏ రజిత ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే ‘అమ్మకు అక్షరమాల--ఉల్లాస్’ పరీక్ష లక్ష్యం

ఝరాసంగం: మండల కేంద్రమైన ఝరాసంగం గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం మహిళలకు ‘ఉల్లాస్’ పరీక్షలు నిర్వహించారు. ‘అమ్మకు అక్షరమాల’ కార్యక్రమం ద్వారా మహిళా సంఘ సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యం అని ఝరాసంగం ఐకేపీ సీసీ తుక్కమ్మ తెలిపారు. ఉల్లాస్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న సంఘ సభ్యులైన మొత్తం 120 మంది మహిళలకు ‘అక్షరవికాసం’ పుస్తకం సహాయంతో తెలుగు చదవడం, రాయడం, అంకెలు గుర్తించడం వంటి ప్రాథమిక అక్షరాస్యత అందించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. గత సంవత్సరం అక్టోబర్ 27న ప్రారంభించి 150 రోజుల పాటు రాత్రిబడులు నిర్వహించినట్లు తుక్కమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో ఝరాసంగం ఐకేపీ సీసీ తుక్కమ్మ, మండల సమైఖ్య అధ్యక్షురాలు మమత, వీవోఏలు బి. నాగరాణి, మొహమ్మద్. మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు కనీస వేతనాలు ఇవ్వాలి : యార్లగడ్డ

కృష్ణా జిల్లా–గన్నవరం(వాయిస్ టుడే): సమాజానికి మూల స్తంభాలుగా ఉన్న జర్నలిస్టులకు కనీస వేతనాలు అందించేలా నూతనంగా ఎన్నికైన ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) కార్యవర్గం కృషి చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ 11వ ప్లీనరీ కార్యక్రమానికి చివరి రోజైన ఆదివారం సాయంత్రం యార్లగడ్డ హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జర్నలిస్టు నాయకుల్ని ఉద్దేశించి యార్లగడ్డ ప్రసంగిస్తూ జర్నలిస్టులకు కనీస వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. కనీస వేతన చట్టం అమలు అయ్యేలా ఐజేయు నూతన కార్యవర్గం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించాలని సూచించారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వార్తలు సేకరించి, ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంతోపాటు, సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం చేయూతనివ్వాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. సుమారు 24 సంవత్సరాల తర్వాత ఐజేయు సమావేశాలకు విజయవాడ వేదిక కావటం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సమావేశాలను దిగ్విజయంగా నిర్వహించిన ఏపీయూడబ్ల్యూజే నాయకత్వాన్ని అభినందించారు. ఐజేయు అధ్యక్షులుగా ఎన్నికైన బలివిందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్ గా ఎన్నికైన డి.సోమసుందర్ ఇతర కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన ఆయన జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐజేయు చేస్తున్న కృషిని ప్రశంసించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను శాలువా కప్పి సత్కరించారు.



## మున్సిపల్ బిజెపి ఫ్లోర్ లీడర్‌గా రాజశేఖర్ రెడ్డి

మక్తల్ మార్చ్ 29 వాయిస్ టుడే ప్రతినిధి: ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మక్తల్ మున్సిపాలిటీ నుండి బిజెపి తరఫున గెలుపొందిన కౌన్సిలర్ల సమావేశం ఇవాళ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీపీ కొండయ్య నివాసంలో జరిగింది .ఈ సందర్భంగా మక్తల్ మున్సిపల్ బిజెపి ఫ్లోర్ లీడర్ గా 1వ వార్డు నుండి గెలుపొందిన బి.రాజశేఖర్ రెడ్డిని ఎన్నుకున్నారు. అదేవిధంగా డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా 4వ వార్డు నుండి గెలుపొందిన పీకే. నరసింహను ఎన్నుకున్నారు వీరిని 2వ వార్డు నుండి గెలుపొందిన టప్ప కృష్ణ ప్రతిపాదించారు .సోమవారం జరగనున్న మున్సిపల్ బడ్జెట్ సమావేశం, కోఆప్షన్ సభ్యుల ఎన్నిక సందర్భంగా బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఎంపిక చేపట్టారు. అదేవిధంగా ఇతర అంశాలపై చర్చించడం జరిగింది పాలకవర్గం చర్చ సందర్భంగా పాలకవర్గం మంచి పనులు ప్రతిపాదించిన సందర్భంలో అభినందించడం ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించడం చేయాలని సూచించడం జరిగింది. పాలకవర్గం అనుసరించే అంశాలపై ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసం బిజెపి సభ్యులు పాటుపడాలని ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు కొండయ్య సూచించారు .బిజెపి ఫ్లోర్ లీడర్ గా ఎంపికైన బి.రాజశేఖర్ రెడ్డి,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా ఎంపికైన పీకే నరసింహ లను అదేవిధంగా 2వ వార్డు కౌన్సిలర్ టప్ప కృష్ణ లను ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు కొండయ్య పార్టీ కండువాలతో సన్మానించి అభినందించారు .ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మున్సిపల్ లో పనిచేసి ప్రజల మన్ననులు పొంది పార్టీ అభివృద్ధికి పాటుపడాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## కస్తూర్బా బాలికల విద్యాలయంలో అర క్వింటా స్వీట్ కార్న్ వితరణ

**-- ఎడవల్లి దాత లక్ష్మయ్య మానవత్వం**



ముదిగొండ మండలం మార్చి 29 వాయిస్ టుడే: సమాజంలో తోటివారికి సాయం చేయడంలోనే నిజమైన తృప్తి ఉందని ముదిగొండ మండల పరిధిలోని ఎడవల్లి లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఓరుగంటి లక్ష్మయ్య మరోసారి చాటిచెప్పారు.న్యూ లక్ష్మీపురం సర్పంచ్ సలీమా ఖాసీం బాబు చేస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఆదివారం ఆయన తన దాతృత్వంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పట్ల ఉన్న మక్కువను చాటుకున్నారు.న్యూ లక్ష్మీపురం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సందర్శించిన లక్ష్మయ్య, అక్కడి విద్యార్థినుల కోసం సుమారు అర క్వింటా (50 కిలోలు) స్వీట్ కార్న్ కంకులను ఉచితంగా పంపిణీ చేశారు. స్వచ్ఛమైన మనసుతో ఆయన చేసిన ఈ చిన్న వితరణ పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిరా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థినుల పట్ల లక్ష్మయ్య చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులకు పోషకాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఆయన చేసిన ఈ సాయానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిందరికి స్ఫూర్తినిస్తాయని ఆమె పేర్కొన్నారు.



## శ్రీరామనవమి సందర్భంగా పిట్లంలో రథోత్సవం, కుస్తీ పోటీలు నిర్వహణ

ఉమ్మడి నిజాంబాద్ జిల్లా బ్యూరో, వాయిస్ టుడే మార్చ్ 29 : పిట్లం (కామారెడ్డి జిల్లా): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో శనివారం రాత్రి రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆదివారం గ్రామంలో కుస్తీ పోటీలను నిర్వహించి ఉత్సవాలకు మరింత వైభవం చేకూర్చారు. ఈ కార్యక్రమాలను గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రథోత్సవ సమయంలో భక్తులు భజనలు, పూజా కార్యక్రమాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కుస్తీ పోటీలకు వివిధ ప్రాంతాల నుండి కుస్తీగాళ్లు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు.లాస్ట్ కుస్తీ విజేతలకు3000 నిర్వాహకులు అందజేశారు. గ్రామంలో శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి.



Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**